


వార్తాప్రభ
RNI No. APTEL/2004/12176
epaper : https://varthaprabha.com
సమగ్ర వార్తా దినపత్రిక
విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ




శ్రీ పరాభవ నామ సంవత్సర దసరా ఉత్సవాలు సందర్బంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు , గవర్నర్ అబ్దుల్ నజీర్ లకు ఉత్సవ ఆహ్వానపత్రిక అందజేశారు.ఈ కార్యక్రమం లో,దేవాదాయశాఖ కమిషనర్ కే. రామచంద్ర మోహన్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వికె శీనా నాయక్, స్థానాచార్య శివ ప్రసాద్ శర్మ, ఉప ప్రధాన అర్చకులు శంకర శాండిల్య తదితరులు పాల్గొన్నా చిత్రం -విజయవాడ,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :

| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 164 | ది.1-10-2026 | గురువారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 164 | Date : 1-10-2026 | Thursday | Pages : 8 | Rs.1/- |

# పట్టాల పంపిణీతో 26వేల పేద కుటుంబాలకు భరోసా

- డబుల్ ఇంజన్ సర్కార్‌తో పేదలకు వందల రెట్ల లబ్ది
- ఎన్టీఆర్ జిల్లాలో ఇంటి పట్టాలు పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు
- రూ.28,112 కోట్ల విలువైన 707ఎకరాల భూములకు హక్కులు
- విమెన్ వర్క్ ఫోర్సులో అగ్రస్థానంలో విశాఖ, విజయవాడ
- కూటమి ప్రభుత్వ ప్రతి అడుగూ స్వర్ణాంధ్ర సాధన వైపే
- ప్రభుత్వం చేసే అభివృద్ధికి అడ్డు పడటమే గొడ్డలి పార్టీ పని
- విజయవాడలో 'పేదలకు పట్టాభిషేకం' బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు









**విజయవాడ,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రజలు వేసిన ప్రతీ ఓటుకూ న్యాయం చేస్తూ ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్ జెట్ స్పీడుతో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ ముందుకు వెళ్తోందని వ్యాఖ్యానించారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో నిర్వహించిన పేదలకు పట్టాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్న సీఎం దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న భూములకు హక్కులు కల్పిస్తూ పేదలకు పట్టాలు పంపిణీ చేశారు. బహిరంగ సభలో ఏర్పాటు చేసిన ర్యాంపుపై మంత్రులు సత్యకుమార్ యాదవ్, నాదెండ్ల మనోహర్ తో కలిసి నడుస్తూ ప్రజలకు అభివాదం చేశారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి సీఎం ప్రసంగించారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ..” విశాఖపట్నంలో 28 వేల మందికి, మంగళగిరిలో 5,800 కుటుంబాలకు భూములపై హక్కులు కల్పిస్తూ పట్టాలు ఇచ్చాం. ఇప్పుడు విజయవాడలో 26,401 వేల మంది కుటుంబాలకు పట్టాలు ఇస్తున్నాం. మొత్తం కలిపి ఇప్పటి వరకూ 60 వేల మంది పేదలకు పట్టాలు ఇవ్వటం నా అదృష్టంగా భావిస్తున్నాను. రూ.52 వేల కోట్ల విలువైన భూముల్ని పేదలకు ఇవ్వటం సంతోషంగా ఉంది. పేదలకు జరుగుతున్న పట్టాభిషేకం ఇది. విజయవాడలో ఇస్తున్న భూముల విలువ రూ.28,112 కోట్లుగా ఉంది. 707 ఎకరాల్లోని 34 లక్షల చదరపు గజాల స్థలానికి పేదలకు హక్కులు కల్పించాం. ఒక్కో స్థలం విలువ రూ.50 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకూ ఉంటుంది. ఇదే పేదల ఆత్మగౌరవానికి కూటమి ప్రభుత్వం చేస్తున్న పట్టాభిషేకం. దశాబ్దాలుగా పేదలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను చూసి చలించి మీ స్థలాలకు హక్కుల కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నాం. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో పేదలకు పట్టాలు వచ్చేలా కృషి చేసిన ప్రజాప్రతినిధులకు, అధికారులకు అభినందనలు తెలియచేస్తున్నా. గత పాలనలో ఐదేళ్ల పాటు విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టాం, ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటాం. ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను భవిష్యత్తు కోసం జాగ్రత్తగా కాపాడుకోవాలని అందరికీ సూచిస్తున్నాను. రాష్ట్రంలో దశాబ్దాలుగా ఉన్న భూ సమస్యల్ని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ముందుకు వెళ్తున్నాం. విశాఖ, వట్టిచెరుకూరు, కంగుమంది, కైకలూరు, అమలాపురం లాంటి చోట్ల ఉన్న ఈ తరహా సమస్యల్ని పరిష్కరించి పట్టాలు ఇచ్చాం.” అని ముఖ్యమంత్రి అన్నారు.

**అభివృద్ధికి గొడ్డలి పార్టీ అడ్డంకులు..** “2019-24లో గత పాలకులు ప్రతి ఇంట్లోనూ ఆస్తుల వివాదాలు సృష్టించారు. పట్టాదారు పాస్ పుస్తకాలపై వారి బొమ్మలేసుకున్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టుతో ఇబ్బందులు సృష్టించారు. సర్వేరాళ్లపై బొమ్మలు వేసుకోడానికి రూ.800 కోట్లు ఖర్చు చేశారు. ఆ డబ్బులు ఉంటే పేదలకు మరింత సంక్షేమం జరిగేది. ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో భూముల న్నిటిని రీసర్వే చేసి రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నాం. ఎలాంటి వివాదాలు లేని కొత్త వ్యవస్థను తీసుకువచ్చేలా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. సంక్షేమం- అభివృద్ధి- సంపద సృష్టి అనేది నిరంతరం జరిగేలా వివిధ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ఇప్పటికే రూ.1.50 లక్షల కోట్లు అభివృద్ధికి ఖర్చు చేశాం. వైసీపీ రాక్షసులు పట్టిసీమ ప్రాజెక్టుకు అడ్డంపడ్డారు. కానీ పట్టుదలతో ప్రాజెక్టు పూర్తి చేసి ఇప్పటికే 490 టీఎంసీల నీటిని తీసుకువచ్చాం. ఎల్ నినో కారణంగా కృష్ణా నదిలో శ్రీశైలం, ప్రకాశం బ్యారేజీకి నీరే రాలేదు. పట్టిసీమ నుంచి నీరు తెచ్చి డెల్టా ప్రాంతానికి నీరు ఇచ్చాం. విజయవాడకు కూడా నీటి సమస్య లేకుండా చేయగలిగాం. గోదావరి నదిలో ఈ ఏడాది ఇప్పటి వరకూ 1400 టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లాయి. రోజుకు 75 టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్తోంది. అందులో ఓ 100 టీఎంసీలు తెచ్చుకుంటే అంతా సస్యశ్యామలం అవుతుంది. పోలవరం ప్రాజెక్టును వచ్చే ఏడాదికి పూర్తి చేసి గ్రావిటీపై తీసుకువస్తాం. కృష్ణా డెల్టాలో పొదుపు చేసిన నీటిని రాయలసీమ ప్రాంతానికి ఇస్తాం. అన్ని ప్రాంతాలకూ తాగు, సాగునీరు ఇవ్వాలన్నదే మా లక్ష్యం. మనతో పాటు మన పొరుగు రాష్ట్రాల వారు కూడా బాగుండాలన్నదే మా సిద్దాంతం. గోదావరి - కావేరి నదుల అనుసంధానం జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు నీటి కొరతే రాదు. వచ్చే మూడేళ్లలో రూ.35 వేలకోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. 2028 కృష్ణా పుష్కరాల నాటికి కృష్ణా-గోదావరి నీళ్లు పుష్కలంగా మనకు వస్తాయి” అని సీఎం వ్యాఖ్యానించారు.

**మహిళా వర్క్ ఫోర్సులో ఏపీ కీలకం..** “అభివృద్ధి భవిష్యత్తులో సంపద సృష్టికి అవసరం. అభివృద్ధి- సంక్షేమమే కూటమి ప్రభుత్వానికి రెండు కళ్లు. ప్రజల ఆదాయాన్ని పెంచేలా మా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పేదల సంక్షేమం మా మొదటి ప్రాధాన్యం ఇస్తున్నాం. ఠంచనుగా మొదటి తేదీనే వారికి పెన్షన్ ఇస్తున్నాం. స్త్రీశక్తి ద్వారా ఆడబిడ్డలకు డబ్బులు ఆదా అవుతున్నాయి. గత పాలకులు రూ.32 వేల కోట్ల మేర విద్యుత్ ఛార్జీల భారం వేశారు. మేం ట్రూ డౌన్ చేసి విద్యుత్ భారం తగ్గించాం. కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చాం. ఆ మాట నిలబెట్టుకున్నాం. అన్నా క్యాంటీన్ ద్వారా పేదల కడుపు నింపేలా మేం చర్యలు తీసుకుంటున్నాం. మత్స్యకారుల సేవలో, ఆటోడ్రైవర్ల సేవలో, నేతన్నల సేవలో కార్యక్రమాల ద్వారా ఆయా వర్గాలకు చేయూత అందుతోంది. వడ్డెర్లు, గీత కార్మికులకు కూడా సహకారం అందిస్తున్నాం. పేదల జీవితాల్లో వెలుగులు నింపేలా పీ4 కార్యక్రమం తీసుకువచ్చాం. కుప్పంలో ఓ సాధారణ మహిళను టీవీఎస్ కంపెనీ దత్తత తీసుకుంది. నిన్నటి వరకూ కూలీగా ఉన్న ఆ మహిళ ఇటుకల బట్టీ యూనిట్ ను ఏర్పాటు చేసుకుని 20 మందికి ఉపాధి అందిస్తోంది. కేంద్ర గణాంకశాఖ విమెన్ వర్క్ ఫోర్సుపై ఓ నివేదిక విడుదల చేసింది. విశాఖ మొదటి స్థానంలో ఉంది.

# వృద్ధులకు సర్కార్ వైద్యంతో భరోసా

- 2025-26లో వృద్ధులకు 1.10 కోట్ల ఆరోగ్య పరీక్షలు
- 2026-27లో ఇప్పటి వరకు 52.79 లక్షల సేవలు
- 74 వృద్ధాశ్రమాల్లో ని వృద్ధుల సమగ్ర ఆరోగ్య అంచనా
- 18.8% మందిలో కుశీగుబాటు సమస్య, 9.8% మందిలో తరచూ పడిపోయే సమస్య
- స్వాంతనకు ప్రత్యేక చర్యలు
- అక్టోబర్ నెలలో వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక కార్యక్రమాలు: మంత్రి సత్యకుమార్ యాదవ్





**అమరావతి,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** రాష్ట్రంలోని వృద్ధులకు వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. వృద్ధులు ఆసుపత్రులకు వచ్చే వరకు వేచి చూడకుండా వారి వద్దకే వెళ్లి వైద్య సేవలు, ఆరోగ్య పరీక్షలు, ఫిజియోథెరపీ, పునరావాస సేవలు అందిస్తున్నామని చెప్పారు. గ్రామస్థాయి నుంచి జిల్లా ఆసుపత్రుల వరకు వృద్ధుల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక సేవలు అందుబాటులో ఉంచామన్నారు. అక్టోబర్ 1న అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా మంత్రి ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. అక్టోబర్ నెలంతా వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి, ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు.

**పీహెచ్‌సీ నుంచి జిల్లా ఆసుపత్రి వరకు..** 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి జిల్లా ఆసుపత్రుల వం-కు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రతి గురువారం పీహెచ్‌సీల్లో వృద్ధుల కోసం ప్రత్యేక వైద్య సేవలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అవసరమైన వారిని మెరుగైన వైద్యం కోసం తదుపరి స్థాయి ఆసుపత్రులకు పంపిస్తున్నామని తెలిపారు. జిల్లా ఆసుపత్రుల్లో ప్రత్యేక వృద్ధుల వార్డులు ఏర్పాటు చేసి, కదలికల్లో ఇబ్బందులు ఉన్న వారికి ఫిజియోథెరపీ, పునరావాస సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా ఆసుపత్రులు లేనిచోట ఏరియా ఆసుపత్రుల్లో ప్రత్యేక వృద్ధుల వార్డులు ఉన్నాయి.

**74 వృద్ధాశ్రమాల్లో సమగ్ర సర్వే..** వృద్ధులకు సమాజ స్థాయిలోనే మెరుగైన వైద్య సేవలు అందించడంలో భాగంగా రాష్ట్రంలో 74 ( ప్రభుత్వ గుర్తింపు పొందిన) వృద్ధాశ్రమాలను ప్రత్యేక వైద్య బృందాలు సందర్శించాయి. ఈ సందర్భంగా వృద్ధుల ఆరోగ్య పరిస్థితిని సమగ్రంగా అంచనా వేశాయి. . గత ఏడాది అక్టోబర్లో జరిగిన ఈ అంచనాల్లో వృద్ధుల్లో ప్రధానంగా కనిపిస్తున్న వివిధ ఆరోగ్య, మానసిక, రోజువారీ జీవన సమస్యలను గుర్తించాయి. సర్వేలో 18.8% మందిలో కుంగుబాటు సమస్య, 9.8% మందిలో తరచూ పడిపోవడం, 7.5% మందిలో జ్ఞాపకశక్తికి సంబంధించిన సమస్యలు, 2.1% మందిలో జ్ఞాపకశక్తి సమస్యతో పాటు కుంగుబాటు, మిగిలినవారిలో జ్ఞాపకశక్తి సమస్య, కుంగుబాటు, తరచూ పడిపోవడం వంటి మూడు సమస్యలు కలిసి ఉన్నట్లు గుర్తించారు. 6.4% మందిలో ఒకటి కంటే ఎక్కువ వృద్ధాప్య సంబంధిత ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. లిమిగిలిన వారిలో వంట చేయడం, సరుకులు కొనడం, ప్రయాణించడం లేదా ఇంటి బయటకు వెళ్లడం, సాధారణ పనులను స్వయంగా నిర్వహించడం వంటి రోజువారీ అవసరమైన కార్యకలాపాల్లో ఇబ్బందులు ఉన్నట్లు గుర్తించారు. లిసర్వేలో గుర్తించిన వారికి అవసరమైన కౌన్సెలింగ్, చికిత్స, ఇతర సహాయక సేవలు అందించారు.

# రాయల సీమ ప్రజల ఆకాంక్షలు, న్యాయవాదుల సమస్యలను కూటమి ప్రభుత్వం విస్మరించింది

- వైయస్ జగన్‌ను కలిసిన కర్నూలు వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ న్యాయవాదులు
- రాయలసీమ న్యాయవాదుల ప్రయోజనాల కోసం గత ప్రభుత్వంలో చేపట్టిన కార్యక్రమాలను వివరించిన న్యాయవాదులు



**తాడేపల్లి,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయ-స్ జగన్ ను కర్నూలు వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్‌కు చెందిన న్యాయవాదులు కలిశారు. వైయస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాయలసీమ ప్రాంతం, న్యాయవాదుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పలు కీలక కార్యక్రమాలు చేపట్టారని వారు వివరించారు. కర్నూలును జ్యుడిషియల్ క్యాపిటల్‌గా ప్రకటించడం, హ్యూమన్ రైట్స్ కమిషన్, లోకాయుక్తలను కర్నూలుకు తరలించడం, కర్నూలుకు మార్చడం, కర్నూలులో నేషనల్ లా యూనివర్సిటీకి శంకుస్థాపన చేయడం వంటి అంశాలను వారు ప్రస్తావించారు.అలాగే ఏపీ స్టేట్ అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్‌కు రూ.100 కోట్లు కేటాయించడం, ‘లా నేస్తం’ ద్వారా జూనియర్ న్యాయవాదులకు రూ.49.51 కోట్లు చెల్లించడం, కర్నూలులో వక్ఫ్ బోర్డు ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలు న్యాయవాదుల సంక్షేమం కోసం చేపట్టినవని వారు వైయస్ జగన్‌కు వివరించారు.ప్రస్తుతం కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఆ దిశగా స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని న్యాయవాదులు తమ అభిప్రాయాన్ని వైయస్ జగన్ దృష్టికి తీసుకువచ్చారు. రాయలసీమ ప్రజలు, న్యాయవాదుల ఆకాంక్షలను ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం విస్మరిస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైయస్ జగన్‌ను కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి, కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు జి. స్వాములు, న్యాయవాదులు పి. సువర్ణరెడ్డి, ఎస్. హనుమంతరెడ్డి, ఎం. ప్రభాకర్, వై. ప్రకాష్‌రెడ్డి, ఎన్. శివనిఖిలేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# 20 లక్షల ఉద్యోగాల కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## -ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార & హౌసింగ్ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి



**రేపల్లె,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** ప్రభుత్వ పథకాలతో చదువుకున్న యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర సమాచార గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. రేపల్లె పట్టణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం పర్యటించనున్న ప్రాంతాలను ఇన్చార్జి మంత్రి పార్థసారథి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, రెవెన్యూ శాఖ మంత్రి సోదరులు అనగాని శివప్రసాద్ లు కలిసి బుధవారం పరిశీలించారు. ముందస్తు ట్రయల్ రన్ నిర్వహించారు. హెలిప్యాడ్ ప్రాంతం, భద్రతా చర్యలను పరిశీలించారు. ప్రజాప్రతినిధులతో సీఎం ముఖాముఖి నిర్వహించే ప్రాంతాలను పరిశీలించారు. తదుపరి ప్రజావేదిక ప్రాంతానికి చేరుకున్నారు. ప్రజా వేదిక ఏర్పాట్లు, సీటింగ్ విధానం, సమీపంలో ఉన్న 57వ కార్యకర్తల సమావేశం రేపల్లె నియోజకవర్గం పార్టీ శ్రేణుల సమీక్ష సమావేశం వేదికను పరిశీలించారు. తదుపరి మీడియాను ఉద్దేశించి మాట్లాడారు. పేదల సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందని పేదల సేవలో వంటి కార్యక్రమాలే చాటి చెబుతున్నాయని జిల్లా ఇన్చార్జి మంత్రి అన్నారు. పేద లబ్ధిదారుల పట్ల అధికారులు సహృదయంతో వ్యవహరించాలి, సంక్షేమ పథకాలు అందేలా చూడాలని సూచించామన్నారు. పేదల సేవలో రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. ప్రతి నెల ఏదో ఒక నియోజకవర్గంలో రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరై లబ్ధిదారులతో మాట్లాడి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకోవడం సంతోషదాయకం అన్నారు. సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలు ఎలా లబ్ధి పొందుతున్నారు, ఎలాంటి మార్పు లబ్ధిదారుల్లో వస్తుంది,.. అనే విషయాలను రాష్ట్ర ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తుందన్నారు. పథకాల ద్వారా విద్యార్థులు చదువుకోవడమే గాకుండా వారి చదువుకు సరిపడా ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి పెట్టుబడులు, పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీకి నోటిఫికేషన్లు ఇస్తుందన్నారు. ప్రభుత్వ పరిపాలన మంచి విధానాలను పరిశీలించిన పెట్టుబడిదారులు, బహుళ జాతి కంపెనీలు రాష్ట్రంలోకి వస్తున్నాయని జిల్లా ఇన్చార్జి మంత్రి చెప్పారు. ప్రజల సంక్షేమం కొరకు చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలు గుర్తించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుకు ఆర్థిక వనరులు మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. డీఎస్సీలో 16,500 ఉద్యోగాలు విడుదల చేసి, ఉద్యోగాలు కల్పిస్తే వాటిపై అపోహలు సృష్టించడం సరికాదన్నారు. 2027 సంవత్సరం మార్చి నెల నాటికి రెవిన్యూ సమస్యలు రాష్ట్రంలో ఉండరాదని లక్ష్యంతో ముఖ్యమంత్రి పని చేస్తున్నారన్నారు. దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న భూ సమస్యలన్ని పరిష్కారం కానున్నాయని తెలిపారు. రేపల్లె లో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమం గురువారం జరుగుతుందని మంత్రి తెలిపారు. ప్రజలంతా ఉదయం 9 గంటలకు హాజరుకావాలని ఆయన కోరారు. టిడిపి, బిజెపి, జనసేన పార్టీలు కూటమితో సంయుక్తంగా ప్రజల సంక్షేమ కొరకు పని చేస్తున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్, చేనేత కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ హేమలత, బుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, జిల్లా అధికారులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రబీ పంటల ఎంఎస్‌పీ పెంపు రైతులకు మరింత ధర భరోసా

- 2027-28 మార్కెటింగ్ సీజన్‌కు కేంద్ర కేబినెట్ నిర్ణయాన్ని స్వాగతించిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- రైతుకు గిట్టుబాటు ధర కల్పించడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం



**అమరావతి,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** 2027-28 మార్కెటింగ్ సీజన్‌కు రబీ పంటల కనీస మద్దతు ధరలను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్వాగతించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో అన్ని నిర్దేశిత రబీ పంటల ఎంఎస్‌పీ పెంపునకు ఆమోదం తెలపడం రైతులకు మరింత ధర భరోసా కల్పించే నిర్ణయమని పేర్కొన్నారు. గోధుమకు క్వింటాల్‌కు రూ.2,610, బార్లీకి రూ.2,286, శనగకు రూ.5,958, మసూర్ పప్పుకు రూ.7,390, రేప్‌సీడ్ ఉ మస్టర్డ్/ఆవాలకు రూ.6,613, కుసుమకు రూ.7,215 కనీస మద్దతు ధరగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. గత సీజన్‌తో పోలిస్తే కుసుమకు క్వింటాల్‌కు రూ.675, రేప్‌సీడ్ ఉ మస్టర్డ్‌కు రూ.413, మసూర్ పప్పుకు రూ.390, బార్లీకి రూ.136, శనగకు రూ.83, గోధుమకు రూ.25 చొప్పున ఎంఎస్‌పీ పెంచినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా పప్పుధాన్యాలు, నూనెగింజలకు అధిక మద్దతు ధర కల్పించడం ద్వారా రైతులను పంటల వైవిధ్యీకరణ వైపు ప్రోత్సహించేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. రైతు పండించిన ప్రతి పంటకు పెట్టుబడికి తగిన ప్రతిఫలం, గిట్టుబాటు ధర అందాలన్నదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్దేశమని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రైతుల ఆదాయం పెంపు, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం, మార్కెట్లో ధరల ఒడిదుడుకుల నుంచి రైతులను రక్షించడం వంటి అంశాలకు అత్యంత ప్రాధాన్యం అవసరమన్నారు. రాష్ట్రంలోనూ రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు ఇతర వ్యవసాయ ఇన్‌పుట్లు సకాలంలో అందుబాటులో ఉంచడంతో పాటు, అవసరమైన సందర్భాల్లో మార్కెట్ జోక్యం ద్వారా రైతులకు గిట్టుబాటు ధర దక్కేలా చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. అన్నదాతకు ఆర్థిక భరోసా కల్పిస్తూ వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయి అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# జండు బామ్ కొత్త ప్రచారం 'అన్‌డూ విత్ జండూ'






**విజయవాడ,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** ఆధునిక జీవనశైలిలో యువత ఎదుర్కొంటున్న మెడ నొప్పి, తలనొప్పి, నిరంతరం తెరలను చూడటం, సామాజిక మాధ్యమాలను అతిగా చూడటం వల్ల కలిగే అలసట వంటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని జండు బామ్ 'అన్‌డూ విత్ జండూ' పేరుతో కొత్త ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇమామి లిమిటెడ్‌కు చెందిన జండు బామ్ 16 నుంచి 28 ఏళ్ల యువతను లక్ష్యంగా చేసుకుని సమకాలీన అంశాలు, హాస్యం, సాంస్కృతిక అంశాలను మేళవిస్తూ ఈ ప్రచారాన్ని రూపొందించింది. ఆధునిక జీవితంలోని వివిధ ఇబ్బందులను 'నొప్పుల ప్రపంచం' అనే ఊహాజనిత నేపథ్యంలో చూపిస్తూ, జండు బామ్‌తో ఉపశమనం పొందవచ్చనే సందేశాన్ని అందిస్తోంది. కెరీర్ ఒత్తిడి, పని వల్ల కలిగే అలసట, అతిగా ఆలోచించడం, సంబంధాల్లోని సమస్యలు వంటి రోజువారీ ఇబ్బందులను కూడా ప్రచారంలో ప్రస్తావించారు. ఇమామి లిమిటెడ్ డైరెక్టర్ మోహన్ గోయెంకా మాట్లాడుతూ, తరతరాలుగా భారతీయ కుటుంబాలలో విశ్వసనీయమైన బ్రాండ్‌గా ఉన్న జండు బామ్‌ను నేటి యువతకు మరింత చేరువ చేయడమే లక్ష్యమన్నారు. ట్రీ కమ్యూనికేషన్స్, అబ్బాస్ మిర్జా రూపొందించిన ఈ ప్రచారం టెలివిజన్, అంతర్జాల వేదికలు, అంతర్జాల వినోద వేదికలు, సామాజిక మాధ్యమాల ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు సహా పలు ప్రధాన మార్కెట్లలో కొనసాగుతోంది.

# బియ్యం ధరకు రెక్కలు

● కిలో రూ.75కి చేరిన రేటు.. ● ఆకస్మిక తనిఖీలకు, ధరల కట్టడికి పౌర సంక్షేమ సంఘం డిమాండ్!



**కాకినాడ,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** బహిరంగ మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలనంటుతుంటే, సామాన్యుడి కడుపు నింపే బియ్యం ధరలు విపరీతంగా పెరిగిపోవడంపై పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం మిల్లర్ల సిండికేట్, అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెట్ దారుల దందా వల్లే మార్కెట్లో కృత్రిమ కొరత సృష్టించి బియ్యం ధరను కిలో రూ.75కు చేర్చారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే త్వరలోనే కిలో బియ్యం రూ. 90కి చేరే ప్రమాదం ఉందంటూ బాంబు పేల్చారు.

**రైతు బజార్లలో సబ్సిడీ బియ్యం 'ముద్ద అన్నం'.. పాత బియ్యం ఏవి?..** ప్రభుత్వం రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా కిలో రూ. 50, రూ. 52 లకు సబ్సిడీ బియ్యం అందిస్తున్నామని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అందుతున్న బియ్యం నాణ్యత దారుణంగా ఉందని రమణరాజు మండిపడ్డారు. తింటే అరగని, వండితే ముద్దగా మారే కొత్త "దాళ్వా బియ్యాన్ని" ఇస్తుండటంతో ప్రజలు వాటిని తినలేక మళ్లీ బహిరంగ మార్కెట్లోనే ఎక్కువ ధర పెట్టి కొనుగోలు చేస్తూ అప్పులపాలవుతున్నారన్నారు. రైతు బజార్లలో వండుకోవడానికి అనువైన, నూకలు లేని నాణ్యమైన "పాత బియ్యాన్ని" మాత్రమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

**రేషన్ డిపోల్లో నిబంధనల ఉల్లంఘన!** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జీవోల ప్రకారం రేషన్ బియ్యంలో నూకల శాతాన్ని 25% నుండి 10%కి తగ్గించి, సార్టెక్స్ చేసిన బియ్యాన్ని మాత్రమే పంపిణీ చేయాల్సి ఉంది. అయితే క్షేత్రస్థాయిలోని చాలా డిపోలలో ఇప్పటికీ పాత, నాణ్యత లేని బియ్యాన్నే ఇస్తూ పేద ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు.

**అధికారులు తక్షణమే రంగంలోకి దిగాలి!...** కాకినాడ జిల్లా యంత్రాంగం, టాస్క్‌ఫోర్స్ మరియు పౌరసరఫరాల శాఖ అధికారులు వెంటనే నిద్రమత్తు వీడి రంగంలోకి దిగాలని రమణరాజు కోరారు. హోల్‌సేల్, రిటైల్ దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు (సోదాలు) నిర్వహించి, బ్లాక్ మార్కెట్ దారులు, మిల్లర్లపై ఉక్కుపాదం మోపాలని, రేషన్ డిపోలు మరియు రైతు బజార్లలో వాసన రాని, నూకలు లేని సార్టెక్స్ పాత బియ్యం మాత్రమే లభించేలా చర్యలు తీసుకోవాలని రమణ రాజు స్పష్టం చేశారు.

# బాపారావు సేవలు చిరస్మరణీయం: యార్లగడ్డ



**హనుమాన్ జంక్షన్,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం వేలేరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు దొనవల్లి బాపారావు (85) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు బుధవారం బాపారావు నివాసానికి వెళ్లి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పనిచేసిన బాపారావు వేలేరు గ్రామ పార్టీ కార్యదర్శి, అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారని ఎమ్మెల్యే తెలిపారు. వేలేరు పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడిగా, కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్‌గా, జిల్లా రైతు విభాగం ఉపాధ్యక్షుడిగా సేవలందించారని పేర్కొన్నారు. రైతులు, పాడి రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని, కబడ్డీ క్రీడాకారుడిగానూ గుర్తింపు పొందారని అన్నారు. ఆయన సేవలు చిరస్మరణీయమని, బాపారావు మృతి టీడీపీకి, వేలేరు గ్రామానికి తీరని లోటని యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు.

# పోగొట్టుకున్న సెల్ ఫోన్లు భారీగా సేకరణ

● కోటి 23 లక్షల 60 వేల విలువైన 618 సెల్ ఫోన్లు బాధితులకు తిరిగి అప్పగింత





**కాకినాడ,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** కాకినాడ జిల్లా పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నెట్వర్క్ నిఘా, డేటా విశ్లేషణ పద్ధతులను ఉపయోగించి బాధితులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను తిరిగి సేకరించి ఆ బాధితులకు అప్పగించడంలో కాకినాడ జిల్లా పోలీసులు సఫలీకృతులయ్యారు. ఒక కోటి 23 లక్షల 60 వేల విలువ గల 618 సెల్ ఫోన్లను బాధితులు పోగొట్టుకున్న బాధితులకు అప్పగించారు. సిఇఐఆర్ పోర్టల్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను ఆధారంగా ఈ సెల్ ఫోన్లను సేకరించినట్లు జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ తన కార్యాలయంలో వెల్లడించారు. ఈ సందర్భంగా బిందు మాధవ్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 13 విడతల్లో మొత్తం 8 కోట్ల 92 లక్షల 27 వేల రూపాయలు విలువ గల 5221 పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను సేకరించినట్లు పేర్కొన్నారు. సైబర్ మోసాలు బారిన పడకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. మొబైల్ దొంగతనం లేదా పోగొట్టుకున్నప్పుడు తక్షణమే సిమ్ కార్డు, బ్యాంకు ఖాతాలను బ్లాక్ చేయించుకోవాలని సూచించారు. అలాగే సెకండ్ హ్యాండ్ ఫోన్ కొనేటప్పుడు అపరిచితుల నుంచి కొనుగోలు చేయవద్దని సూచించారు. ఫోన్లను సేకరించడంలో అత్యంత ప్రతిభ కనబరిచిన జిల్లా ఐటీ కోర్ పోలీసులను ఎస్పీ బిందు మాధవ్ అభినందించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ ఎం కిషోర్ కుమార్, ఏఆర్ డిఎస్పి శ్రీహరి రావు, ఐటీ కోర్, వివిధ స్టేషన్లకు చెందిన పోలీస్ కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

# చిత్తూరులో అమెజాన్ నౌ సేవలు ప్రారంభం

**చిత్తూరు,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** అమెజాన్ తన 'డెలివరీ–ఇన్–మినిట్స్' సేవ అమెజాన్ నౌను చిత్తూరులో ప్రారంభించింది. నగరంలోని వినియోగదారులు కిరాణా సరుకులు, పండ్లు, కూరగాయలు, పాలు, బ్రెడ్, వంట నూనె, నెయ్యి, బిస్కెట్లు, కన్ఫెక్షనరీతో పాటు వ్యక్తిగత సంరక్షణ, ఫ్యాషన్, బ్యూటీ, హోమ్ అండ్ కిచెన్, చిన్న గృహోపకరణాలు తదితర పదుల వేల ఉత్పత్తులను నిమిషాల్లోనే పొందవచ్చని అమెజాన్ తెలిపింది. చిత్తూరులో రోజువారీ అవసరాలతో పాటు ప్రీమియం చాక్లెట్లు, వ్యక్తిగత సంరక్షణ, గృహ సంరక్షణ ఉత్పత్తులకు కూడా మంచి డిమాండ్ ఉందని వెల్లడించింది. అమెజాన్ నౌ సేవలు 10 వారాల కంటే తక్కువ వ్యవధిలో నాలుగు రెట్లు విస్తరించాయని, ప్రస్తుతం దేశంలోని 60కి పైగా నగరాలు, పట్టణాల్లో అందుబాటులో ఉన్నాయని పేర్కొంది. దీపావళి నాటికి 100 నగరాలకు విస్తరించేందుకు సంస్థ ప్రణాళికలు చేపట్టింది. 750కి పైగా మైక్రో, అర్బన్ ఫుల్ఫిల్మెంట్ కేంద్రాల ప్రత్యేక నెట్‌వర్క్ ద్వారా ఆర్డర్లను వేగంగా డెలివరీ చేస్తున్నట్లు తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లో 10 లక్షలకు పైగా ఉత్పత్తులు అదే రోజు, 40 లక్షలకు పైగా ఉత్పత్తులు మరుసటి రోజు అందుబాటులో ఉన్నాయని పేర్కొంది. అక్టోబర్ 8 నుంచి ప్రారంభమయ్యే అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్‌లో అమెజాన్ నౌపై ఆకర్షణీయమైన డీల్స్ ఉంటాయని తెలిపింది. ఎస్‌బీఐ కార్డులు, ఈఎంఐ లావాదేవీలపై 10 శాతం తక్షణ డిస్కౌంట్, ప్రైమ్ సభ్యులకు అదనపు ఆదా అవకాశాలు ఉంటాయని వెల్లడించింది.

# ఆక్స్ఫర్డ్ స్కూల్ లో రేపు ఉచిత మెగా వైద్యశిబిరం



**జి.కొండూరు,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాలలలో భాగంగా స్థానిక ఆక్స్ఫర్డ్ హై స్కూల్ ఆవరణలో ఈ నెల 2వ తేదీ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించ నున్నట్లు కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు కొల్లి నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. జి.కొండూరు మండల పరిధిలోగల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాల్సిందిగా ఆయన కోరారు.

# పట్టాల పంపిణీ కార్యక్రమం ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీఓ ఏ. కుమార్.



**తిరువూరు/విజయవాడ,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో ఈరోజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా "పేదలకు పట్టాభిషేకం" లబ్ధిదారులకు పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో, కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు భోజన సదుపాయం కల్పించేందుకు చేపడుతున్న ఏర్పాట్లను తిరువూరు రెవెన్యూ డివిజన్ అధికారి ఏ. కుమార్ గారు పరిశీలించారు. ఈ కార్యక్రమానికి తిరువూరు ఆర్డీఓ ఏ. కుమార్ గారిని విజయవాడ నార్త్ మండలం స్పెషల్ ఆఫీసర్‌గా నియమించిన నేపథ్యంలో, ఆయన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా భోజన ఏర్పాట్లను పరిశీలించడంతో పాటు, వంటలను రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు సూచనలు చేశారు.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పేదలకు పట్టాభిషేకం'ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా బుధవారం (సెప్టెంబర్ 30, 2026) విజయవాడలోని మాకినేని బసవన్నయ్య స్టేడియంలో ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు మండలం,కుంటముక్కల గ్రామానికి చెందిన లబ్ధిదారులకు టీడీపీ మండల పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వేములకొండ వెంకటేశ్వరరావు, లంక నాగేశ్వరరావు, ఏఎంసి మాజీ చైర్మన్ వుయ్యూరు వెంకటనరసింహారావు లతో కలిసి ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న జి కొండూరు మండల తహశీల్దార్ డి.రిబ్కా రాణి.
–జి.కొండూరు,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :

# ఓట్ల చోరీపై ప్రధాని మోడీ, అమిత్ షా రాజీనామా చేయాలి

● చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్వర్రావు తక్షణమే రాజీనామా చేయాలి ● ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బొర్రా కిరణ్

**నందిగామ,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** తక్షణమే ప్రస్తుత చీఫ్ ఎలక్షన్ కమీషనర్ జ్ఞానేష్ కుమార్ ను పదవి నుండి తొలగించి, అతనిపై క్రిమినల్ కేసులు పెట్టి అరెస్ట్ చేయాలనీ జిల్లా కాంగ్రెస్స్ పార్టీ జిల్లా అధ్యక్షులు బుర్ర కిరణ్ నాయకత్వంలో ఆ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఏఐసీసీ మరియు పీసీసీ అధ్యక్షులు వైస్ షర్మిలా రెడ్డి ఆదేశానుసారం స్థానిక నాయకుల ఆధ్వర్యం లో దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాలో జరిగిన భారీ అవకతవకలు, కోట్ల సంఖ్యలో ఓట్ల అక్రమ తొలగింపునకు వ్యతిరేకంగా ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నందిగామలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా పార్టీ శ్రేణులతో కలిసి అయ్య దేవర కాళేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి భారీ ర్యాలీగా వెళ్లిన నాయకులు, నందిగామ గాంధీ బొమ్మ సెంటర్ వద్ద రోడ్డుపై బైఠాయించి కేంద్ర ప్రభుత్వానికి, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ఘాటుగా నిరసన చేశారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాలోని అవకతవకలు మరియు అప్రజాస్వామ్యంగా సుమారుగా మన ప్రజల13 కోట్ల ఓట్ల తొలగింపు మరియు 3, 4 కోట్ల ఓటర్లకు తగిన గుర్తింపు కార్డులు లేవని నోటీసులు ఇవ్వడం, ఓటర్ల జాబితాలో మార్పులు చేసే అధికారాన్ని కూడా ఎలక్షన్ కమీషన్ తన గుప్తట్లో పెట్టుకుని ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తున్న విధానం,వీటన్నింటికీ ప్రధాన సూత్రధారి అయిన చీఫ్ ఎలక్షన్ కమీషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని, అతనిపై క్రిమినల్ కేసులు పెట్టి అరెస్ట్ చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని తమరి ద్వారా గౌరవనీయులైన భారత రాష్ట్రపతి వర్యులకు పంపాలని వినతి పత్రంలో కోరారు.ప్రజాస్వామ్యాన్ని పరిహసించేలా జరిగిన ఈ ఓట్ల చోరీకి నైతిక బాధ్యత వహిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రి అమిత్ షా వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను తక్షణమే విధుల నుంచి తొలగించి, ఆయనపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఈ సందర్భంగా



ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్ స్పష్టం చేశారు.ప్రజల ఓటు హక్కును,ప్రజాస్వామ్యాన్ని కాపాడటం కోసం గౌరవ రాష్ట్రపతి వర్యులుగా చర్యలు తీసుకోవాలని,అలాగే ఓటర్ల జాబితాలో జరిగినట్లు చెప్తున్న అక్రమాలు,అప్రజాస్వామిక ఓట్ల తొలగింపులపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోని,అర్హులైన ప్రతి పౌరుడికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓటు హక్కు తిరిగి కల్పించేలా, ఎన్నికల సంఘాన్ని ఆదేశించి భారత రాజ్యాంగ సంరక్షకులుగా,దేశ పౌరుల ప్రాథమిక హక్కు అయిన ఓటు హక్కును కాపాడటానికి మీరు తగిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నాము.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్ ఛార్జ్ లు మందా వజ్రయ్య,జగ్గయ్యపేట ఇన్ ఛార్జ్ కర్నాటి అప్పారావు,సీనియెర్ పార్టీ నాయకులు రేపాల మోహనరావు,జిల్లా దీజ సెల్ ఛైర్మెన్ నల్లమోతు శ్రీనివాసరావు,జిల్లా ాు సెల్ ఛైర్మెన్ భోజగాని మురళి కృష్ణ,మాజీ సర్పంచ్ గొంది సురేష్,నందిగామనియోజకవర్గ మండల పార్టీ అధ్యక్షులు గోపు నరేంద్ర,తోట గోపాల్రావు,కొట్టారు రవికుమార్,సుకుమార్,పెసరమల్లి శ్యాం బాబు,కె.వెంకటేశ్వరరావు ,తుమ్మల నాగేశ్వరావు,కొమ్మినేని నాగేశ్వరరావు,షేక్ కాజా, సత్యనారాయణ మరియు S శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ గ్రీన్ కోర్ కాకినాడ జిల్లా సమన్వయకర్తగా సి.హెచ్. కిరణ్ కుమారి



**కాకినాడ,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ కాకినాడ జిల్లా సమన్వయకర్తగా సి.హెచ్. కిరణ్ కుమారి నియమితులయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ రాష్ట్ర సంచాలకులు పి. స్రవంతి ఉత్తర్వులు జారీ చేశారు.సి.హెచ్. కిరణ్ కుమారి రౌతులపూడి మండలం ఎస్. అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి సంరక్షణ, జీవవైవిధ్య పరిరక్షణపై అవగాహన పెంపొందించడంలో ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేయనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పి. రమేష్, విద్యాశాఖాధికారులు కె.వి.వి సత్యనారాయణ, ఈ.ప్రభాకర శర్మ, జిల్లా సైన్స్ అధికారి కేసరి శ్రీనివాసరావు నూతన జిల్లా సమన్వయకర్త సి.హెచ్. కిరణ్ కుమారిని అభినందించారు.

# ఎలిజిబెత్ రాణికి వైసీపీ శ్రేణుల ఘన సత్కారం



**గన్నవరం,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** గన్నవరం మాజీ జడ్పీటీసీ అన్నవరపు ఎలిజిబెత్ రాణికి గన్నవరం వైసీపీ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పడమర సురేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట వెంకయ్య, జిల్లా వైసీపీ ఉపాధ్యక్షుడు కోడెబోయిన బాబి, పార్టీ నాయకులు గొంది పరంధామయ్య, జిల్లా మహిళా కార్యదర్శి సూర్రెడ్డి మనమ్మ, దేవరపల్లి సుశీల, పోలిమెట్ల జయరాజ్, సాతులూరి శివ, నాగరాజుకుమారి, చేబ్రోలు లక్ష్మీ మౌనిక, కొలుసు శిరీష, ఆరేపల్లి జేజమ్మ తదితరులు పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎలిజిబెత్ రాణికి అభినందనలు తెలిపారు.

# ప్రకృతి పరిరక్షణలో జాతీయ సేవా పథకం విద్యార్థులు సేవ అమూల్యం..




**గుంటూరు,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** ప్రకృతి పరిరక్షణలో జాతీయ సేవా పథకం విద్యార్థుల కృషి అభినందనీయమని టి జె పి యస్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి వి హెచ్ కామేశ్వర శాస్త్రి పేర్కొన్నారు. సమస్త మానవాళి తో పాటు అన్ని రకాల జీవరాసులకు ప్రాణ వాయువు చాలా ముఖ్యమని,అటువంటి స్వచ్ఛమైన గాలి చెట్లనుండి ఉద్భవించి సమస్త ప్రాణికోటికి ఆక్సిజన్ ఇవ్వడం జరుగుతుందని. పర్యావరణ సమతుల్యాన్ని కాపాడడంలో మొక్కలు చాలా కీలకమైన పాత్ర నిర్వహిస్తాయని చెప్పారు. అంతేకాకుండా మొక్కలు మనకు ఆహారం, ఔషధాలు వంటివి ఇస్తాయని మొక్కలు నాటి,వాటిని సంరక్షించాలని చెప్పారు. నిన్న గుంటూరు నగరంలో ఎకో పార్కులో 1000 చెట్లను సంరక్షించే కార్యక్రమం లో తమ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటరీలు ఉత్సాహం గా పాల్గొని మొక్కలకు చుట్టూ కంచె ఏర్పాటు చేయడం పడిపోయిన మొక్కలకు కర్రలు కట్టడం, మొక్క చుట్టూ చక్కని పాది ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించారని జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జెవి సుధీర్ కుమార్ పేర్కొన్నారు. మొక్కల సంరక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ యస్ యస్ వాలెంటీర్స్ కి కళాశాల డిగ్రీ,పి జి ప్రిన్సిపాల్స్ చేతులమీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

# మూడవ తేదీన విస్సన్నపేట హై స్కూల్ ఎస్ఎంసి ఎన్నికలు



**విస్సన్నపేట,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో దేశవ్యాప్తంగా పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసి) ఎన్నికలు కోరశీ లేకపోవడంతో వాయిదా పడిన సంగతి సర్వత్రా తెలిసిందే. విద్యాశాఖ ఆదేశానుసారం అక్టోబర్ 3 వ తేదీ ఉదయం 9 గంటలకు యధావిధిగా పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం రంగారా శోభారాణి తెలియజేశారు. 508 మంది విద్యార్థిని విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని 464 కుటుంబాలకు సంబంధించిన తల్లిదండ్రులలో ఎన్నికకు 50 శాతం కన్నా ఎక్కువ హాజరు కావాల్సి ఉంటుందని చెప్పారు. మండల విద్యాశాఖ అధికారి సుధాకర్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపింది.

# చేవేంద్ర చెన్నూరు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కాగిత శంఖుస్థాన లు



**పెడన,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** పల్లె పండుగ--3.0 కార్యక్రమంలో భాగంగా పెడన మండలం చెన్నూరు గ్రామంలో రూ.15 లక్షల వి బి జి రామ్ జి నిధులు వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డుకు చేవెంద్ర గ్రామంలో 2 లక్షల రూపాయలతో నిర్మించనున్న గోకుల షెడ్డు కు ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి దశలవారీగా పూర్తి చేసేందుకు పల్లె పండుగ--3.0 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడేలా నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా సీసీ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని నిర్ణీత గడువులో పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇంచార్జ్ పంచకర్ల సురేష్ మాజీ జడ్పీటీసీ అర్జా నగేష్ సెలపాటి ప్రసాద్ పంద్రాజు లక్ష్మణ పంద్రాజు హరిబాబు నీటి సంఘం అధ్యక్షులు చెన్నంశెట్టి చంటి బ్యాంకు ప్రెసిడెంట్ అంకెం పమిడేశ్వరావు గంధం గోపాలకృష్ణ వి బి జి రామ్ జి మండల టి ఎ వజీద్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## అద్దంకిలో వైసీపీ దిద్దుబాటు రాజకీయం!

బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గంలో స్థానిక ఎన్నికల రాజకీయ వాతావరణం కూటమి ప్రభుత్వ పట్టుతో పాటు ప్రతిపక్ష వైసీపీ పునర్వ్యవస్థీకరణ ప్రయత్నాలతో క్రియాశీలకంగా ఉంది. ప్రస్తుతం ఈ నియోజకవర్గానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అద్దంకి నియోజకవర్గ పరిధిలో ముండ్లమూరు, కొరిశపాడు, జే.పంగులూరు, సంతమాగులూరు, అద్దంకి మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల్లో మంత్రి గొట్టిపాటికి బలమైన కేడర్ ఉండడంతో స్థానికంలో అధిరిపోయే రిజల్ట్ ఖాయమని చెబుతున్నారు. అయితే.. వైసీపీ గతంలో చేసిన తప్పులను సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తోంది. గొట్టిపాటి రవికుమార్ వరుసగా ఇక్కడి నుండి ఐదోసారి విజయం సాధించి రికార్డు సృష్టించారు. దీంతోపాటు కూటమి అధికారంలోకి రావడం, ఆయన రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం సంపాదించడంతో నియోజకవర్గంలోని అన్ని మండలాలపై టీడీపీ క్యాడర్ గట్టి పట్టు సాధించింది. ఇదే సమయంలో నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో జనసేన పార్టీ కూడా విస్తరిస్తూ కూటమి బలాన్ని పెంచుతోంది. ఇదంతా స్థానిక ఎన్నికల్లో ప్రభావం చూపుతుందని అంటున్నారు. గత ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీ చేసి ఓడిపోయిన చిన హనిమిరెడ్డి స్థానంలో పార్టీ అధిష్టానం సమూల మార్పులు చేస్తోంది. పార్టీ కేడర్‌ను యాక్టివ్ చేసేందుకు., నియోజకవర్గంలో పట్టు కోల్పోకుండా ఉండేందుకు కొత్త ఇన్‌ఛార్జ్ లను నియమించి సమావేశాలు నిర్వహిస్తున్నారు. పార్టీ ఉనికిని కాపాడుకునేందుకు వైసీపీ శ్రేణులు ప్రయత్నిస్తున్నాయి. అయితే.. అనుకున్న విధంగా వైసీపీ దూకుడు ప్రదర్శించలేక పోవడం గమనార్హం. ఒకరకంగా చెప్పాలంటే.. ఒకప్పుడుశ్రేణులతో కళకళలాడిన వైసీపీ ఇప్పుడు జెండా మోసేవారు లేక ఇబ్బందులు పడుతోంది. మొత్తంగా చూస్తే, అద్దంకి మండలాల్లో ప్రస్తుతం అధికార పక్షం (కూటమి) పూర్తి ఆధిపత్యంలో ఉండగా, ప్రతిపక్ష వైసీపీ రాబోయే రోజుల్లో పుంజుకోవడానికి అంతర్గత బలోపేతంపై దృష్టి పెడుతోంది. అయితే.. కీలక నాయకులుగా ఉన్న కరణం ఫ్యామిలీ వైసీపీలోనే ఉన్నా.. పార్టీకి దూరంగా ఉంటోంది. దీంతో క్షేత్రస్థాయిలో వైసీపీ శ్రేణులపై ఈ ప్రభావం కనిపిస్తోంది. దీనికితోడు.. మంత్రి గొట్టిపాటి చేస్తున్న అభివృద్ధి పనులతో కూడా.. వైసీపీ కేడర్ విచ్ఛిన్నమైంది. ఫలితంగా స్థానిక ఎన్నికల్లో మండల పరిషత్‌ల నుంచి జిల్లా పరిషత్ వరకు కూడా.. కూటమిదే విజయం అనే పరిస్థితి కనిపిస్తోంది.

## మెరుగైన వైద్యం కోసంఎల్ ఓ సీ పత్రాలు అందజేత




**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 30 :(వార్త ప్రభ ప్రతినిధి)** ఎమ్మెల్యే సుజనా చౌదరి ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్. ఓ. సి ) లను జారీ చేస్తున్నారు. ఎమ్మెల్యే , ఆదేశాలతో కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ కూటమి నేతలతో కలిసి భవానిపురం, ఎన్డీయే కార్యాలయంలో బాధితులకు ఎల్ ఓ సీ పత్రాలను అందజేశారు..వించిపేట కు చెందిన మర్రి రాహుల్ (55) ప్యాంక్రియాటైటిస్ తో బాధపడుతూ వైద్య సాయం కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ 4.25 లక్షల విలువైన ఎల్ ఓ సీ ను అందజేశారు. 52 వ డివిజన్ కు చెందిన తమ్మిన రామకృష్ణ (50) రోడ్డు ప్రమాదంలో గాయపడి జాయింట్ రీప్లేస్మెంట్ సర్జరీ, ఎల్ ఓ సీ కొరకు దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ 3 లక్షల విలువైన ఎల్ ఓ సీ ను అందజేశారు.. వించి పేటకు చెందిన సాయి పుండరీశ్వర్ (29) సైనస్ తో బాధపడుతూ వైద్య సాయం కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ 3 లక్షల విలువైన ఎల్ ఓ సీ ను అందజేశారు.కేదారేశ్వర పేట కు చెందిన సయ్యద్ బషీర్ (42) లివర్ డిసీస్ తో బాధపడుతూ వైద్య సాయం కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ 6.32 లక్షల విలువైన ఎల్ ఓ సీ ను అందజేశారు. త్వరితగతిన స్పందించి ఎల్ ఓ సీ పత్రాలను అందజేసిన ఎమ్మెల్యే సుజనా చౌదరి కు బాధితుల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.మాజీ కార్పొరేటర్ మహ్మద్ అబ్దుల్ ఖాదర్, స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ దాడి అప్పారావు, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ వైస్ ప్రెసిడెంట్ నున్న కృష్ణ , కూటమి నాయకులు దేవిన హరి ప్రసాద్, రుద్రపాటి వెంకటేష్, ఆకుల రవి శంకర్ బాధిత కుటుంబ సభ్యులకు ఎల్ ఓ సీ పత్రాలు అందజేశారు..

## ఆక్వాడెవిల్స్ ప్రాంగణంలో వర్షాల కోసం ప్రత్యేక శాంతి పూజలు

**ముఖ్య అతిథిగా పాల్గొని కృష్ణమ్మకు పూజలు చేసిన ఆకుల శ్రీనివాస్**



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 30: (వార్త ప్రభ ప్రతినిధి)** సకాలంలో వర్షాలు కురిపించాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుపు కుండా చక్కగా చూడాలని దేవదేవుడైన మహా శివుడిని ప్రముఖ సామాజికవేత్త ఆకుల శ్రీనివాస్ కుమార్ ప్రార్థించారు. బుధవారం కృష్ణా నది ఒడ్డున ఉన్న ఆక్వాడెవిల్స్ ప్రాంగణంలో గురుస్వామి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆకుల శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు పడక రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, భవిష్యత్తులో తలెత్తబోయే తాగునీటి కొరతను అధిగమించడానికి ఈ పూజలు జరిగాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహాశివునికి ప్రత్యేక పూజా క్రతువులు జరిపించారు. అనంతరం కృష్ణవేణి మాతకు నదిలో చీర, పూజా ద్రవ్యాలను సమర్పించి శాంతి పూజలు నిర్వహించారు. ఈ పవిత్ర పూజా క్రతువులో పలువురు ప్రముఖులు మరియు భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాల్గొన్న వారిలో వి. యువ శేఖర్,సుధాకర్,డి. చంద్రశేఖర్,వి. సింధుజ,టి. సుధాకర్, ఎస్. మాధవి కిరణ్ తదితర ప్రముఖులు ఉన్నారుప్రకృతి కరుణించి సకాలంలో వర్షాలు కురవాలని, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఈ సందర్భంగా నిర్వాహకులు ఆకాంక్షించారు.

# ఆహార భద్రత కోసం అధునాతన పరిశోధనలు





**విజయవాడ పశ్చిమ సెప్టెంబరు 30: (వార్త ప్రభ ప్రతినిధి )**వర్తమాన పరిస్థితుల్లో ఆహారభద్రత మనదేశంలో అత్యంత కీలకమైన విషయంగా మారిందని, ఈ దిశగా అనేక కీలకపరిశోధనలు జరుగుతున్నాయని హైదరాబాదులోని సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ, ప్లాంట్ బయాలజీ గ్రూప్ సీనియర్ అసోసియేట్ డాక్టర్ టి. ఎస్. ఆర్. ఎస్. సందీప్ అన్నారు. కెబిఎన్ కళాశాల బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం "భారతదేశంలో వరి జన్యు సవరణ (జెనోమ్ ఎడిటింగ్): ఇటీవల జరిగిన పురోగతులు మరియు భవిష్యత్తు దిశలు" అనే అంశంపై గౌరవ ఉపన్యాస కార్యక్రమం జరిగింది. ప్రధానవక్తగా పాల్గొన్న సందీప్ మాట్లాడుతూ వాతావరణ మార్పులు, నీటి కొరత, అధిక ఉష్ణోగ్రతలు, వరదలు, ఉప్పుతనం, తెగుళ్ల వంటి సవాళ్లు వరి ఉత్పత్తిపై ప్రభావం చూపుతున్నాయని, ఈ నేపథ్యంలో తక్కువ వనరులతో అధిక దిగుబడిని అందించే, వాతావరణ మార్పులను తట్టుకునే కొత్త వరి రకాల అభివృద్ధి దిశగా జన్యు సవరణ సాంకేతికతంగా ప్రాధాన్యత సంతరించుకుంటోందన్నారు. భారతీయ వరి రకాల జన్యు నేపథ్యాన్ని ఉపయోగించి తక్కువ కాలంలో పండే, మెరుగైన దిగుబడి ఇచ్చే, ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకునే రకాల అభివృద్ధిపై శాస్త్రవేత్తలు దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. వరి పంట అభివృద్ధిలో జన్యు సవరణ, సాంకేతికత వినియోగం తదితర అంశాల్లో ఇటీవల పరిణామాలు, అనువర్తనాలతో పాటు భవిష్యత్తు అవకాశాలను వివరించారు. జెనోమ్ ఎడిటింగ్‌ను కేవలం కొత్త సాంకేతికతగా కాకుండా భారతదేశంలో ఆహార భద్రత, రైతుల ఆదాయం, వాతావరణ–స్థిరమైన వ్యవసాయానికి ఉపయోగపడే శక్తివంతమైన సాధనంగా చూడాలన్నారు. శాస్త్రీయ పరిశోధన, జీవభద్రత, రైతుల అవసరాలు, ప్రజలలో అవగాహన---ఈ నాలుగు అంశాలను సమన్వయం చేస్తే భారతదేశ వరి రంగంలో జన్యు సవరణ సాంకేతికత గణనీయమైన మార్పు తీసుకురావటం సాధ్యపడుతుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ వ్యవసాయ ప్రధానమైన మన దేశంలో ఆహారధాన్యాల ఉత్పత్తి ప్రజాజీవనంతో పాటు దేశఆర్థికాభివృద్ధికి కూడా ముఖ్యభూమికగా ఉంటుందన్నారు. సాంకేతిక విజ్ఞానాన్ని వ్యవసాయ రంగానికి మరింతగా విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. విభాగాధిపతి డాక్టర్ ఎం. తేజ, రీసెర్చ్ సెల్ డైరెక్టర్ డాక్టర్ కె.కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నిబ్బద్ధతకు నిదర్శనం అమరజీవి కామ్రేడ్ రేడపొంగు యాకోబు... సిపిఐ






**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 30 :(వార్త ప్రభ ప్రతినిధి )**భారత కమ్యూనిస్టు పార్టీ, విజయవాడ నగర సమితి సీనియర్ నాయకుడు కామ్రేడ్ రేడపొంగు యాకోబు(81) నిజాయితీకి, నిబ్బద్ధతకు నిలువుటద్దంలాంటి వ్యక్తి అని సిపిఐ నగర నగర సహాయ కార్యదర్శి నక్క వీరభద్రరావు అన్నారు. కామ్రేడ్ యాకోబు ఈ రోజు ఉదయం 7 గంటల సమయంలో మరణించిన వార్త తెలియగానే సిపిఐ రాష్ట్ర ప్లినరీ సమావేశాల సందర్భముగా కడపలో ఉన్న సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు యాకోబు కుటుంబ సభ్యులతో ఫోన్ లో మాట్లాడి పరామర్శించి అయన మృతికి తన ప్రగాఢ సంతాపం తెలియజేసారు. నగర పార్టీ నాయకులు యాకోబు స్వగృహానికి చేరుకొని తొలుత నగర సహాయ కార్యదర్శి నక్క వీరభద్రరావు యాకోబు భౌతికకాయంపై ఎర్ర జెండా కప్పి నివాళులు అర్పించారు. కామ్రేడ్ యాకోబు గారికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు . కామ్రేడ్ రేడపొంగు యాకోబు 7వ దశకం చివరలో ఆనాటి విజయావాడ కమ్యూనిస్టు దిగ్గజాలు, కామ్రేడ్ తమ్మిన పోతరాజు, ఉప్పలపాటి రామచంద్రరావు స్ఫూర్తితో యువజన సమాఖ్య కార్యకర్తగా, యువజన నాయకుడిగా అనేక మంది స్థానిక యువకులను కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షించడంలో క్రియాశీలక పాత్ర పోషించారు. స్థానిక నాయకులు నరసింహరాజు మరియు వారి పినతండ్రి అయిన ఆర్.ఐజాక్ ల పోర్త్సలంతో అనాటి 4వ డివిజన్ శాఖ కార్యదర్శిగా బాధ్యతలను తీసుకోని ఆనాటి నుండి స్థానికంగా డివిజన్ పార్టీ బలోపేతానికి విశేష కృషి చేసారు. వృత్తి రీత్యా మున్సిపల్ ఎంప్లాయి అయిన కామ్రేడ్ యాకోబు ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ నగర ఉపాధ్యక్షునిగా,. మున్సిపల్ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ గా మున్సిపల్ కార్మికులకు సేవలు అందించిన గొప్ప నాయకుడు. స్థానిక డివిజన్ కార్యదర్శిగా టైనర్ పేట అభివృద్ధికి విశేష కృషి చేయడ, టైనర్ పేట ప్రాథమిక పాఠశాలను ఉన్నత పాఠశాలగా మార్చడం వంటి కార్యక్రమాల ద్వారా స్థానికంగా కమ్యూనిస్టు పార్టీని ప్రజలకు మరింత చేరువ చేసి ఆనాటి 4వ డివిజన్ కార్పొరేటర్లగా తాజ్ నోస్ దాస్, గండు సావిత్రమ్మ , డి.వి.రమణబాబు ఎన్నికకావడంలో ఎంతో కీలక పాత్ర పోషించారు. అంతేకాకుండా పశ్చిమ నియోజక శాసన సభ్యులుగా ఉప్పలపాటి రామచంద్రరాజు, కాకర్లపూడి సుబ్బరాజు, షైక్ నాజర్ వలి లు గెలుపొందడంలో అయన పాత్ర మరువరానిది. ఆనాటి సిపిఐ నగర నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, పల్లా సూర్యారావుల ప్రోత్సాహంతో నగర పార్టీలో అంచలంచెలుగా నగర కార్యవర్గ సభ్యునిగా, నగర పార్టీ కోశాధికారిగా సుదీర్ఘ కాలం నగర పార్టీకి సేవలందించారు. నగర పార్టీ కోశాధికారిగా తన బాధ్యతలను ఎంతో సమర్ధవంతంగా నిర్వర్తించడమే కాకుండా క్రమశిక్షణ, నిజాయితీలలో అందరికి ఆదర్శంగా ఉంటూ అనేక మందికి స్ఫూర్తిగా నిలిచారు. అటువంటి గొప్ప నాయకుని కోల్పవడం స్థానిక పార్టీకే కాకుండా నగర పార్టీకి తీరనిలోటు అని అన్నారు. అటువంటి నాయకుని స్ఫూర్తిగా తీసుకోని ముందుకు సాగడమే మనం ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. కామ్రేడ్ యాకోబుకు నివాళులు అర్పించిన వారిలో నగర కార్యదర్శివర్గ సభ్యులు మూలి సాంబశివరావు, తాడి పైడయ్య, కొట్టు రమణారావు, సంగుల పేరయ్య, నగర కార్యవర్గ సభ్యులు డి.వి.రమణబాబు, తూనం వీరయ్య, కొడాలి ఆనందరావు, ఎస్.కె.నజీర్, ప్రజానాట్యమండలి నాయకులు ఆర్. పిచ్చయ్య, డివిజన్ కార్యదర్శులు రేడపొంగు ప్రభుదాస్, రాయన గుర్నాధం, కుర్ర శివయ్య, కరోతి వెంకటేశ్వరరావు, రాచకుల శ్రీనివాసరావు,కొండపల్లి క్రిష్ణ, స్థానిక నాయకులు చీర్ల రామస్వామి, బెవర శ్రీనివాసరావు, చింతాడ పార్వతి, ఆర్.ఉమా,ఎస్.వి .రమణ, సోమేశ్వరరావు, ఎస్.కె.అమీర్, జి.రామారావు, కె.పౌల్, జానీ, తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలి

**ప్రజలకు తాగునీరు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు అందుబాటులో ఉంచాలి**

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 30 :(వార్త ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఉదయం తన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ప్రకాశం బ్యారేజ్, సీతమ్మవారి పాదాలు, తుమ్మలపల్లి కళాక్షేత్రం, పాత ప్రభుత్వ ఆసుపత్రి, అజిత్‌సింగ్ నగర్, డాబాకోట్లు, మాకినేని బసవపున్నయ్య స్టేడియం తదితర ప్రాంతాలను సందర్శించి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అంగరంగ వైభవంగా నిర్వహించనున్న ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ, ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అవసరమైన మౌలిక వసతులను పూర్తిస్థాయిలో కల్పించాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రజలకు తాగునీటి సౌకర్యం అందుబాటులో ఉండేలా చూడటంతో పాటు, మరుగుదొడ్లను పరిశుభ్రంగా, వినియోగానికి అనువుగా ఉంచాలని సూచించారు.తాగునీటి పాయింట్ల వద్ద నిరంతరం నీటి సరఫరా ఉండేలా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, మరుగుదొడ్లను క్రమం తప్పకుండా శుభ్రం చేస్తూ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమం పూర్తయ్యే వరకు సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవసరమైన సౌకర్యాలు నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ పర్యటనలో అదనపు కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్, చీఫ్ ఇంజనీర్ పి. సత్యకుమారి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్. నిర్మల గ్లోరీ, డిప్యూటీ డైరెక్టర్ (హార్టికల్చర్) చంద్రశేఖర్, ఎస్టేట్ ఆఫీసర్ ఏ. శ్రీధర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మురళి గౌడ్, రీజినల్ ఫైర్ ఆఫీసర్ సిహెచ్. రత్నబాబు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి. అన్నపూర్ణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై ఆసుపత్రులకు అవగాహన



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 30 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు బుధవారం మధ్యాహ్నం గవర్నర్‌పేటలోని మెడికల్ అసోసియేషన్ హాల్‌లో నగరంలోని ఆసుపత్రుల యాజమాన్యాలకు బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై సేఫ్ ఎన్విరాన్‌మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగరంలోని 200కు పైగా ఆసుపత్రుల యాజమాన్యాలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గోపాల నాయక్ మాట్లాడుతూ ఆసుపత్రుల్లో బయోమెడికల్ వ్యర్థాలను నిబంధనల ప్రకారం వేర్వేరుగా సేకరించి, నిర్వహించాలని సూచించారు. ఇందుకోసం పసుపు, ఎరుపు, నీలం, నలుపు రంగుల చెత్తబుట్టలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. పసుపు రంగు బిన్‌లో శరీర అవయవాలు తదితర బయోమెడికల్ వ్యర్థాలు, ఎరుపు రంగు బిన్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు, సిరంజీలు తదితర వ్యర్థాలు, నీలం రంగు బిన్‌లో గాజు మరియు సంబంధిత వ్యర్థాలు, నలుపు రంగు బిన్‌లో సాధారణ వ్యర్థాలను వేరు చేయాలని సూచించారు. నలుపు రంగు బిన్‌లోని సాధారణ వ్యర్థాలను కూడా విజయవాడ నగరపాలక సంస్థకు అందించే ముందు తడి, పొడి వ్యర్థాలుగా వేరు చేసి అందించాలని అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. శ్రీనివాసరావు, ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ వేమూరి నాగ వరప్రసాద్, ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ టి. అనిరూప్, సేఫ్ ఎన్విరాన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ వి. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి 5 వేల మందితో ఘన**

## స్వాగతం పలికిన పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జి బుద్ధా వెంకన్న





**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 30 :(వార్త ప్రభ ప్రతినిధి)**విజయవాడ పశ్చిమ నియోజకవర్గం వినాయకుని గుడి వద్ద నిర్వహించిన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరైన సందర్భంగా పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్ బుద్ధా వెంకన్న ఆధ్వర్యంలో సుమారు 5000 మంది ప్రజలు, పార్టీ శ్రేణులతో ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్యక్రమానికి చేరుకున్న సమయంలో పశ్చిమ నియోజకవర్గం మొత్తం పసుపుమయం కాగా, భారీగా తరలివచ్చిన ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున నినాదాలతో స్వాగతం పలికారు. బుద్ధా వెంకన్న నాయకత్వంలో భారీ జన సమీకరణతో కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. పేద, మధ్యతరగతి కుటుంబాలకు భూమిపై హక్కు కల్పించే దిశగా పట్టాల పంపిణీ కార్యక్రమం ఎంతో ప్రాధాన్యత కలిగినదని, ప్రజలకు సొంత స్థలం, సొంత ఇంటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని బుద్ధా వెంకన్న పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకుంటున్న నిర్ణయాలకు పశ్చిమ నియోజకవర్గ ప్రజలు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారని అన్నారు.

## అగ్ని ప్రమాద సమయంలో అప్రమత్తతే ప్రాణ రక్షణకు కీలకం

**విద్యార్థులకు అవగాహన కల్పించిన వీఎంసీ ఫైర్ సిబ్బంది**





**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 30 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ ఫార్మాసిటికల్ కాలేజీలో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయాల్సిన పనులు, చేయకూడని పనులపై వీఎంసీ ఫైర్ సిబ్బంది ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఎఫ్ఓ సిహెచ్. రత్నబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అగ్ని ప్రమాద సమయంలో విద్యార్థులు ఎలా అప్రమత్తంగా వ్యవహరించాలి, సురక్షితంగా బయటకు ఎలా రావాలి అనే అంశాలను వివరించారు.ఈ సందర్భంగా అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు విద్యార్థులు భయాందోళనలకు గురికాకుండా తాము ఉన్న ఫ్లోర్ నుంచి కేవలం మెట్ల మార్గం ద్వారా మాత్రమే కిందకు రావాలని సూచించారు. కిందకు వచ్చిన అనంతరం ఎక్కడపడితే అక్కడికి పరుగులు తీయకుండా అందరూ ఒక నిర్దేశిత సేఫ్ అసెంబ్లీ పాయింట్ వద్దకు చేరుకోవాలని తెలిపారు. ఇలా ఒకే ప్రాంతంలో అందరూ చేరినప్పుడు ఎంత మంది సురక్షితంగా బయటకు వచ్చారు, ఇంకా ఎంత మంది లోపల ఉన్నారనే విషయాన్ని సులభంగా అంచనా వేసి, లోపల చిక్కుకున్న వారిని రక్షించేందుకు అగ్నిమాపక సిబ్బంది తక్షణ చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని వివరించారు.అగ్ని ప్రమాద సమయంలో భయాందోళనలకు గురై విద్యార్థులు వివిధ ప్రాంతాలకు వెళ్లిపోతే ఎంత మంది బయటకు వచ్చారు, ఎంత మంది ఇంకా లోపల ఉన్నారనే విషయాన్ని ఖచ్చితంగా గుర్తించడం కష్టమవుతుందని తెలిపారు. అందువల్ల ప్రమాద సమయంలో ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా, సమన్వయంతో వ్యవహరించడం ఎంతో ముఖ్యమని సూచించారు.అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు సమీపంలో ఉన్న అగ్నిమాపక పరికరాలను ఎలా వినియోగించాలి, గదిలో పూర్తిగా పొగ వ్యాపించినప్పుడు నేలకు దగ్గరగా పాకుతూ సురక్షితంగా ఎలా బయటకు రావాలి, లిఫ్ట్‌ను ఎందుకు ఉపయోగించకూడదు, మెట్ల మార్గం ద్వారానే ఎందుకు బయటకు రావాలి, అగ్ని ప్రమాద సమయంలో ఏం చేయాలి, ఏం చేయకూడదు వంటి అంశాలపై విద్యార్థులకు ఫైర్ సిబ్బంది వివరాత్మకంగా అవగాహన కల్పించారు.అనంతరం విద్యార్థులకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించే విధంగా మాక్ డ్రిల్ నిర్వహించి, అగ్ని ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన రక్షణ చర్యలను ప్రదర్శించారు. విద్యార్థులు కూడా మాక్ డ్రిల్‌లో పాల్గొని అత్యవసర పరిస్థితుల్లో సురక్షితంగా బయటపడే విధానాన్ని ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ మాల్యాద్రి, ఎస్ఎఫ్ఓ నరేష్, వీఎంసీ ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ అమూల్యమైన మాటలు



ఊగిపోకు కోపంతో
నింపుకోకు దోషంతో
ఉంచుకొమ్ము హృదయాన్ని
అత్యంత పవిత్రతతో
సూటిపోటి మాటలతో
ఎవ్వరినీ వేధించకు
పనికిమాలిన తలపులతో
పెను ప్రమాదం తెచ్చుకోకు
తుచ్ఛమైన ఆశలతో
నిజం లేని వార్తలతో
జీవితాలు బలి చేయకు
వ్యక్తిత్వాన్ని కోల్పోకు
నిజమాడని పెదవులతో
స్థిరత లేని మనసుతో
నష్టం కొని తెచ్చుకోకు
నీచమైన గుణాలతో

--గద్వాల సోమన్న,
ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

# జగ్గయ్యపేట మున్సిపల్ పీఠం ఎవరిది?

- 2024 అసెంబ్లీ తీర్పు ప్రభావం చూపుతుందా..?
- 2021 నాటి వైసీపీ ఆధిపత్యం కొనసాగుతుందా..?
- టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి స్థానిక ఎన్నికలు మరో కీలక పరీక్ష

**జగ్గయ్యపేట, సెప్టెంబర్ 30 (వార్తప్రభ):**జగ్గయ్యపేట మున్సిపల్ రాజకీయాలు మరోసారి వేడెక్కుతున్నాయి. రాబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో రాజకీయ సమీకరణాలు, అభ్యర్థుల ఎంపిక, వార్డు స్థాయి బలాబలాలు, గత ఎన్నికల ప్రభావం ఇప్పుడు ప్రధాన చర్చగా మారాయి.1987 నుంచి 2026 వరకు జరిగిన ప్రత్యక్ష మున్సిపల్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకోలేకపోయిందన్న చర్చ స్థానిక రాజకీయ వర్గాల్లో ఉంది. అయితే 2009, 2024లో పరోక్ష విధానంలో మున్సిపల్ పీఠం టీడీపీకి దక్కిన సందర్భాలు ఉన్నాయి.

**2021లో వైసీపీ ఆధిపత్యం** 2021 మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ ఆధిపత్యంతో మున్సిపల్ పాలకవర్గం ఏర్పడింది. ఆ ఎన్నికల తర్వాత జగ్గయ్యపేట మున్సిపల్ రాజకీయాల్లో వైసీపీ బలమైన స్థానాన్ని సంపాదించింది.అయితే 2024లో రాజకీయ సమీకరణాల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. అప్పటి మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రతో పాటు ముగ్గురు కౌన్సిలర్లు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. దీంతో మున్సిపల్ రాజకీయాల్లో అప్పటి వరకు ఉన్న బలాబలాల్లో మార్పులు కనిపించాయి.

**2024 అసెంబ్లీ తీర్పు ప్రభావం ఉంటుందా?** 2024 అసెంబ్లీ ఎన్నికల్లో జగ్గయ్యపేట నియోజకవర్గం నుంచి టీడీపీకి చెందిన శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య) ఎమ్మెల్యేగా ఉన్నారు. రాష్ట్రంలో టీడీపీ--జనసేన--బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. ఈ నేపథ్యంలో రాబోయే మున్సిపల్ ఎన్నికలు స్థానికంగా రాజకీయ పార్టీలకు మరో కీలక పరీక్షగా మారుతున్నాయి.అయితే అసెంబ్లీ ఎన్నికల లెక్కలు, మున్సిపల్ ఎన్నికల లెక్కలు ఒకేలా ఉండవని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గం మొత్తం ఒక రాజకీయ పరిధిగా ఉంటే.. మున్సిపల్ ఎన్నికల్లో ప్రతి వార్డు, ప్రతి అభ్యర్థి, స్థానిక సమస్యలు, వ్యక్తిగత పరిచయాలు, సామాజిక మరియు రాజకీయ సమీకరణాలు కీలకంగా మారే అవకాశం ఉంటుంది.

**టీడీపీ శిబిరంలో ఎవరు?** జగ్గయ్యపేటలో టీడీపీ తరపున ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య)తో పాటు ఆయన సోదరులు




ధనుంజయ్ చినబాబు, శ్రీరామ్ సాయి ప్రసాద్ కుటుంబ సభ్యులు రాజకీయంగా ప్రస్తావనలో ఉన్నారు.అదేవిధంగా మాజీ మంత్రి నెట్టెం రఘురాం, మాజీ ఎమ్మెల్సీ తొండపు దశరథ జనార్ధన్ వంటి సీనియర్ నాయకుల ఉనికి కూడా టీడీపీ రాజకీయ సమీకరణాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

**జనసేన వైపు సామినేని కుటుంబం** జనసేన తరపున మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కుటుంబం కూడా స్థానిక రాజకీయాల్లో కీలకంగా ఉంది. ఆయనతో పాటు ఆయన భార్య విమల భాను, కుమారులు ప్రసాద్ బాబు, ప్రశాంత్ బాబు పేర్లు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి.రాష్ట్ర స్థాయిలో టీడీపీ--జనసేన--బీజేపీ కూటమి అధికారంలో ఉన్న నేపథ్యంలో జగ్గయ్యపేట మున్సిపల్ ఎన్నికల్లో ఈ మూడు పార్టీల మధ్య సమన్వయం ఎలా ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

**వైసీపీ శిబిరంలో బలమైన కేడర్** మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున మాజీ మునిసిపల్ చెర్మన్ లు గా పనిచేసిన తన్నీరు నాగేశ్వరరావు, ఇంటూరి రాజగోపాల్ (చిన్నా)తో పాటు పార్టీకి ఉన్న స్థానిక కేడర్ కూడా మున్సిపల్ ఎన్నికల్లో కీలకంగా మారే అవకాశం ఉంది.2021లో మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ సాధించిన ఆధిపత్యాన్ని తిరిగి కొనసాగించగలదా? లేక 2024 తర్వాత మారిన రాజకీయ సమీకరణాలు ఈసారి ప్రభావం చూపుతాయా? అన్నది చర్చనీయాంశంగా మారింది.

**టికెట్ల కోసం పోటీ.. ఇండిపెండెంట్లుగా బరిలోకి?**

**మరో ఆసక్తికరమైన అంశం టికెట్ల ఆశావహులు.**కూటమి తరపున టికెట్లు ఆశించి అవకాశం దక్కని కొందరు నాయకులు, కార్యకర్తలు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగే అవకాశం ఉందన్న చర్చ కూడా స్థానికంగా వినిపిస్తోంది.అలా జరిగితే అధికారిక పార్టీ అభ్యర్థులతో పాటు రెబల్ లేదా స్వతంత్ర అభ్యర్థుల పోటీ కూడా వార్డు వారీగా ఎన్నికల సమీకరణాలను ప్రభావితం చేసే అంశంగా మారే అవకాశం ఉంది.

**కూటమి గెలిస్తే.. అది ఎవరి విజయం?**జగ్గయ్యపేట మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ--జనసేన--బీజేపీ కూటమి కలిసి పోటీ చేస్తే.. మున్సిపల్ పీఠం కూటమికి దక్కితే దాన్ని కేవలం టీడీపీ విజయంగా చూడాలా? లేక మూడు పార్టీల ఉమ్మడి విజయంగా చూడాలా? అన్న చర్చ కూడా రాజకీయ వర్గాల్లో మొదలైంది.అయితే దీనికి సమాధానం ఎన్నికల తర్వాతే స్పష్టమవుతుంది. ఎందుకంటే మున్సిపల్ ఎన్నికల్లో ప్రతి వార్డులోని అభ్యర్థి బలం, స్థానిక సమస్యలు, ఓటర్ల అభిప్రాయం, పార్టీ సమీకరణాలు ఫలితాలను ప్రభావితం చేయవచ్చు.

**అసలు ప్రశ్న ఇదే..**

2024లో వచ్చిన అసెంబ్లీ తీర్పు 2026 మున్సిపల్ ఎన్నికల్లోనూ ప్రభావం చూపుతుందా?2021లో వైసీపీ సాధించిన మున్సిపల్ ఆధిపత్యం కొనసాగుతుందా?2024లో చోటుచేసుకున్న రాజకీయ మార్పులు ఈ ఎన్నికల్లో ప్రతిఫలిస్తాయా?టీడీపీ--జనసేన--బీజేపీ కూటమి కలిసి పనిచేస్తే దాని ప్రభావం ఎంతవరకు ఉంటుంది?టికెట్లు దక్కని ఆశావహులు స్వతంత్రులుగా బరిలోకి దిగితే వార్డు వారీగా లెక్కలు ఎలా మారతాయి?ఇవన్నీ ఇప్పుడు జగ్గయ్యపేట రాజకీయాల్లో ఆసక్తికరమైన ప్రశ్నలుగా మారాయి.అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గ స్థాయి తీర్పు ఒకటైతే.. మున్సిపల్ ఎన్నికల్లో ప్రతి వార్డు ఒక ప్రత్యేక రాజకీయ రంగం. ప్రతి అభ్యర్థి తనకంటూ ప్రత్యేక సమీకరణాలతో ప్రజల ముందుకు వెళ్లే అవకాశం ఉంది.అందుకే ఎమ్మెల్యే ఏ పార్టీకి చెందినవారు అన్నది ఒక అంశం మాత్రమే. రాష్ట్రంలో ఏ కూటమి అధికారంలో ఉందన్నది మరో అంశం. కానీ మున్సిపల్ పీఠాన్ని నిర్ణయించేది చివరికి వార్డు వారీగా ప్రజలు వేసే ఓటే.

**జగ్గయ్యపేట మున్సిపల్ పీఠం ఈసారి ఎవరిది?**2021లో వైసీపీ ఆధిపత్యం.. 2024లో మారిన రాజకీయ సమీకరణాలు.. 2026లో కొత్త ఎన్నికల సమీకరణాలు..ఈ పరిణామాల మధ్య జగ్గయ్యపేట మున్సిపల్ పీఠం కోసం జరిగే పోటీ స్థానిక రాజకీయాల్లో మరో కీలక అధ్యాయానికి నాంది పలకనుందా?సమాధానం చెప్పేది నాయకుల అంచనాలు కాదు.. రాజకీయ వ్యూహాలు కాదు.. చివరికి జగ్గయ్యపేట ప్రజల తీర్పే.

## బీజెపి ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలకు సన్మానం



**అనుమసముద్రంపేట సెప్టెంబర్ 30 (వార్తాప్రభ)** మండలంలోని బిజెపి ఆధ్వర్యంలో అంగన్వాడి టీచర్లకు బుధవారం సన్మాన కార్యక్రమం పివీఎస్ లక్ష్మీప్రియ బిజెపి రాష్ట్ర మహిళా మోర్చా జోనల్ ఇంచార్జ్ ఏ నాగవేణి బిజెపి నెల్లూరు జిల్లా కార్యదర్శి గోవిందల వాసు అనుమసముద్రంపేట మండల బిజెపి అధ్యక్షులు మండలంలోని హసనాపురం అంగన్వాడి కేంద్రంను సందర్శించి అంగన్వాడీ టీచర్ కు సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.అదేవిధంగా జోలగుంటపల్లి అంగన్వాడి శ్రీకొలను ఎస్సీ అంగన్వాడి శ్రీకొలను చిరమణ ఎస్సీ అంగన్వాడి చిరుమన మెయిన్ అంగన్వాడి కేంద్రాలను సందర్శించి ఆయా అంగన్వాడి టీచర్లకు సన్మాన కార్యక్రమాలు నిర్వహించడం జరిగినది. అదేవిధంగా అంగన్వాడీ టీచర్లకు పలు సూచనలు సలహాలు కేంద్రం కల్పిస్తున్న సదుపాయాలను పోషకాహారాలను గర్భిణీ స్త్రీలకు బాలింతలకు కిషోర్ బాలల సకాలంలో అందించాలని సూచించారు

## శ్రీ కల్యాణ వేంకటేశ్వరుడికి రూ.40 లక్షల విలువైన స్వర్ణ పూత వాహనాలు







**చంద్రగిరి,సెప్టెంబర్ 30:(వార్తా ప్రభ ప్రతినిధి)**శ్రీనివాస మంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామివారికి భక్తులు బంగారు పూత పూసిన గజ, సింహ వాహనాలను విరాళంగా సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన పి.వి. లక్ష్మీ రెడ్డి సింహ వాహనాన్ని, పి.వి. దివ్య ప్రియాంక గజ వాహనాన్ని ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈవో వరలక్ష్మికి బుధవారం అందజేశారు.సుమారు రూ.40 లక్షల విలువైన ఈ రెండు వాహనాలను స్వామివారి బ్రహ్మోత్సవాల్లో వినియోగించనున్నారు. వాహన మండపంలో ఆలయ అర్చకులు గజ, సింహ వాహనాలకు పసుపు, కుంకుమ, పుష్పమాలలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి.అనంతరం దాతలకు స్వామివారి దర్శనం కల్పించి, ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలను ఆలయ అధికారులు అందజేశారు. స్వామివారి సేవకు వాహనాలను సమర్పించడం పట్ల దాతలు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ రాజ్ కుమార్, అర్చకులు బాలాజీ దీక్షితులు, నారాయణ చార్యులు, ఇతర అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## 383 మందికి ఉచిత వైద్య సేవలు

**అగ్రహారంలో జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం**



**జగ్గయ్యపేట, సెప్టెంబర్ 30 (వార్తప్రభ)** :సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలనే ఉన్నత ఆశయంతో జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలను అందిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్ధన్ తెలిపారు.జగ్గయ్యపేట మండలం కే. అగ్రహారం గ్రామంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ శిబిరంలో మొత్తం 383 మంది వైద్య సేవలు పొందారు. జనరల్ వైద్య విభాగంలో 161 మందికి, కంటి వైద్య విభాగంలో 222 మందికి సేవలు అందించారు.కంటి పరీక్షల్లో 136 మందికి కళ్లజోడులు అవసరమని గుర్తించగా, దృష్టిలోపం కారణంగా ఆపరేషన్లు అవసరమైన వారిలో 30 మందికి శుక్లములు, 8 మందికి పొరలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. మొత్తం 38 మందికి శస్త్రచికిత్సలు అవసరమని సూచించారు.అలాగే 235 మందికి షుగర్ పరీక్షలు, 244 మందికి హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.ఈ సందర్భంగా శిబిరం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన గ్రామ నాయకులు, పార్టీ ప్రతినిధులు, వీవోఏలు, ఆశా వర్కర్లు, ఫౌండేషన్ వాలంటీర్లు, వైద్య సిబ్బంది తదితరులకు జయప్రద ఫౌండేషన్ కోఆర్డినేటర్ కట్టా వెంకట నరసింహారావు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో వెలమాటి చంద్రమౌళి, నెట్టెం శివరాం, వైవీఎస్ రెడ్డి, సుంకర సాయి సుధాకర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు అనుమాల వేదాద్రి, గుండ్ల కృష్ణారావు, గంగరాజు, హుస్సేన్, రామారావు, నాగేశ్వరరావు, పుల్లయ్య, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, రవి, అయ్యప్ప, పిచ్చయ్య, వశిష్ట, భరతం లక్ష్మి, విద్యా కమిటీ చైర్మన్ ఆనంగి దుర్గ, వైస్ చైర్మన్ ఆడోత్త లక్ష్మీనారాయణ, సాయి, కిరణ్, వి. సాయి తదితరులు పాల్గొన్నారు.

## సంపూర్ణ ఆరోగ్యమే వికసించే భారత్ కు పునాది



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 30(వార్తా ప్రభ ప్రతినిధి):**దేశ ప్రజల యొక్క సంపూర్ణ ఆరోగ్యమే వికసిత్ భారత్ కు పునాది అని అన్నారు బిజెపి నాయకులు.భారతీయ జనతా పార్టీ సేవా సంకల్ప అభియాన్ అంగన్వాడి ఉత్సవం సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 7 వరకు జరుగు కార్యక్రమాలలో భాగంగా ఇబ్రహీంపట్నం రూరల్ మండలం ఈలప్రోలు గ్రామంలో ఇబ్రహీంపట్నం రూరల్ మండలం అధ్యక్షులు పయ్యావుల జయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు.మండల ఎస్సీ మోర్చా అధ్యక్షులు కల్పన ఆధ్వర్యంలో ఈలప్రోలు గ్రామము అంగన్వాడి సెక్టార్ 1 సూపర్వైజర్ శివకుమారి,అంగన్వాడి సిబ్బంది ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బాలింతలకు మరియు గర్భిణీ స్త్రీలకు లభించే పోషకాహారాలు లబ్ధిదారులు తెలిపారు . మండలాధ్యక్షురాలు పయ్యావుల జయలక్ష్మి గారు ఈ అంగనవాడి సేవలను గర్భిణీలు బాలింతలకు ఐసిడిఎస్ గురించి వివరించారు. గర్భిణీ స్త్రీ లావణ్యకు అంగన్వాడి కేంద్రం శ్రీమంతం చేసి లడ్డు తినిపించారు.ఈ కార్యక్రమం లో బిజెపి సీనియర్ నాయకులు నూతలపాటి బాల కోటేశ్వరరావు(బాల ), ఇబ్రహీంపట్నం రూరల్ మండలం జనరల్ సెక్రటరీ పయ్యావుల రాము,మండల ఉపాధ్యక్షులు సత్యనారాయణ,జిల్లా యువమోర్చా ఉపాధ్యక్షుడు ఆలకుంట చిట్టిబాబు,జిల్లా యువ మోర్చా కార్యవర్గ సభ్యుడు గుంజ అనిల్ కుమార్ , కొండపల్లి మున్సిపాలిటీ అధ్యక్షులు మాధురి,గొల్లపూడి రూరల్ అధ్యక్షులు తిరుపతి నాయుడు కిసాన్ మోర్చా జిఎస్ యుగంధర్, రాజేంద్ర భవాని,నాగమణి పాల్గొన్నారు.

## ఎస్ఎంసి ఎన్నికలలో అధికార పార్టీ నాయకుల జోక్యం తగదు

**వైసిపి ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధి కొండపల్లి మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ గుంజ శ్రీనివాసు**



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 30(వార్తా ప్రభ ప్రతినిధి):** ఎస్ఎంసి ఎన్నికలు అధికార పార్టీ నాయకుల జోక్యం రాజకీయ పార్టీ కేంద్రాలుగా మార్చడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు వైసిపి ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధి కొండపల్లి మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ గుంజ శ్రీనివాసు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం విద్యార్థుల తల్లిదండ్రులను కమిటీగా ఎన్నుకునేటటువంటి ఎస్ఎంసి ఎన్నికలలో కూటమి పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు పాల్గొనడం వారి రాజకీయ పిచ్చి పరాకాష్టకు చేరిందనే దానికి నిదర్శనం అని ఎద్దేవా చేశారు. వారి ప్రమేయంతో పాఠశాలలను కూటమి పార్టీ కార్యాలయాలుగా మార్చారని అన్నారు. ఆధిపత్యం కోసం ప్రలోభాలకు దిగజారటం వారి దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు.పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పేటటువంటి పాఠశాలలలో కూటమి పార్టీలకు చెందిన రాజకీయ నాయకుల జోక్యంతో నేడు అనేక ప్రభుత్వ పాఠశాలలలో ఘర్షణ వాతావరణం ఏర్పడి ఎస్ఎంసి ఎన్నికలు వాయిదా పడ్డాయి. తెలుగుదేశం మరియు కూటమి పార్టీలు ఈ రాష్ట్రంలో చేస్తున్నటువంటి అరాచక పాలనకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. నాడు పాఠశాలలను అత్యంత ప్రాధానమిచ్చి అభివృద్ధి చేస్తే కూటమి ప్రభుత్వం రాజకీయాలకు వాడుకుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కూటమి నాయకులు ఇదే విధంగా వ్యవహరిస్తే రాబోయే రోజుల్లో ఓటు అనే ఆయుధంతో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

## అంతర్జాతీయ పెట్టుబడులకు దక్షిణ భారత్ అనుకూల వేదిక

# శ్రీసిటీ ఎండీ డా. రవీంద్ర సన్నారెడ్డి




**తిరుపతి :సెప్టెంబర్ 30:(వార్తా ప్రభ ప్రతినిధి)** చెన్నైలో జరిగిన నమస్తే ఏషియా సమ్మిట్ - 2026 లో శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని కీలక ప్రసంగం చేశారు. "బిల్డింగ్ పార్టనర్‌షిప్స్ ఫర్ ఏషియాస్ నెక్స్ట్ గ్రోత్ స్టోరీ" అనే అంశంపై ప్రసంగించిన ఆయన, ఆసియా దేశాల కంపెనీలకు భారత్, ముఖ్యంగా దక్షిణ భారతదేశం అందిస్తున్న తయారీ, పెట్టుబడి, సరఫరా గొలుసు అవకాశాలను వివరించారు. సెజ్ లు, పారిశ్రామిక కారిడార్లు, తీరప్రాంత మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలు అంతర్జాతీయ కంపెనీలను స్థానికంగా తయారీ కేంద్రాలు, సరఫరాదారుల నెట్‌వర్క్‌లు ఏర్పాటు చేసేందుకు దోహదపడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఆసియా దేశాల కంపెనీలు స్థానిక తయారీకి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం వలన, వాటితో పాటు సరఫరా గొలుసు కంపెనీలు తయారీ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాయని తెలిపారు.ప్రత్యేకించి శ్రీసిటీ వంటి అంతర్జాతీయ మౌళిక వసతులు గల పారిశ్రామిక కేంద్రాలు, ఇండస్ట్రియల్ కారిడార్ల ఏర్పాటు, తీరప్రాంతాల అభివృద్ధి వంటి కారణాల వల్ల అంతర్జాతీయ కంపెనీలు తమ కార్యకలాపాలకు దక్షిణ భారత్ ను కేంద్రంగా ఎంచుకుంటున్నాయని అన్నారు.అలాగే దావోస్ లో జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం తరహాలో సీఐఐ నిర్వహించనున్న 'ది నీలగిరీస్ ఇండియా ఎకనామిక్ డైలాగ్' కార్యక్రమానికి కూడా తన సహకారం అందిస్తానని ఈ సందర్భంగా డా. సన్నారెడ్డి హామీ ఇచ్చారు. సదస్సులో "కౌలాలంపూర్ అండ్ సెలంగోర్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆండ్ ఇండస్ట్రీ" అధ్యక్షుడు కె.కె.రాజశేఖరన్, సీఐఐ సదరన్ రీజియన్ చైర్మన్ & డాన్ఫాస్ ఇండియా ప్రెసిడెంట్ రవి చంద్రన్ పురుషోత్తమన్, సీఐఐ నమస్తే ఏషియా సమ్మిట్ చైర్మన్ శంకర్ వనవరాయర్, సీఐఐ నమస్తే ఏషియా సమ్మిట్ కో చైర్మన్ & టీవీఎస్ మొబిలిటీ సొల్యూషన్స్ సీఈఓ మధు రఘునాథ్, సీఐఐ తమిళనాడు శాఖ చైర్మన్ & యూఆర్సీ కన్‌స్ట్రక్షన్ మేనేజింగ్ డైరెక్టర్ దేవరాజన్ చిన్నసామి తదితరులు పాల్గొన్నారు.రాబోయే రోజుల్లో ఆసియా దేశాల పారిశ్రామిక, వ్యాపారాభివృద్ధిలో దక్షిణ భారతదేశాన్ని ముఖ్య భాగస్వామిగా తీర్చిదిద్దడంతో పాటు వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత మరియు పారిశ్రామిక సహకారాన్ని మరింత విస్తరించే అంశాలపై సీఐఐ సదరన్ రీజియన్ ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహించిన ఈ 'నమస్తే ఏషియా' సదస్సులో విస్తృతంగా చర్చించారు.




# పల్లా శ్రీనివాసరావుకు మహేష్, భరణి యాదవ్ ఘన సన్మానం

**- తిరుపతి అభివృద్ధి, పార్టీ బలోపేతంపై కీలక చర్చ**





**తిరుపతి: సెప్టెంబర్ 30:(వార్తా ప్రభ ప్రతినిధి)**తిరుపతి పర్యటనకు విచ్చేసిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పల్లా శ్రీనివాసరావును తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి జేబీ శ్రీనివాస్ , తాతయ్యగుంట ఆలయ ఛైర్మన్ శ్రీ మహేష్ యాదవ్, వాసుదేవా యాదవ సేవా సంఘం సంయుక్త కార్యదర్శి చింతా భరణి యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతిలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగిన ఈ మర్యాదపూర్వక భేటీలో తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీ జేబీ శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జేబీ శ్రీనివాస్, మహేష్ యాదవ్, చింతా భరణి యాదవ్‌లు పల్లా శ్రీనివాసరావుకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తిరుపతి నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలపై రాష్ట్ర అధ్యక్షుడితో వారు చర్చించారు.ప్రధానంగా తిరుపతి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, స్థానిక సమస్యలు, పార్టీ కార్యకలాపాలపై చర్చ జరిగినట్లు తెలిపారు. నియోజకవర్గంలో ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని పల్లా శ్రీనివాసరావు సూచించినట్లు సమాచారం.అలాగే పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆయన సూచించారు. తిరుపతి అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకు సాగాలని సూచించినట్లు తెలిసింది.ఈ సందర్భంగా మహేష్ యాదవ్, చింతా భరణి యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సూచనలు పార్టీ శ్రేణులకు మరింత ఉత్సాహాన్ని ఇస్తాయని తెలిపారు. తిరుపతి నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.

# వావిలేరులో అంగన్వాడీ ఉత్సవం



**చేజర్ల సెప్టెంబర్ 30 (వార్తాప్రభ)** పోషణ మాస ఉత్సవం అంగన్వాడీ ఉత్సవాల్లో భాగంగా బుధవారం వావిలేరు గ్రామం నందు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం నందు తల్లులందరినీ హాజరు రోజువారి భోజనం తీసుకునే విధానం గురించి ఎటువంటి ఆహారాలు తీసుకోవాలి వండుకునే విధానాలు పోషక విలువలు ఉన్న ఆహారం తయారు చేసుకోవాలని ప్రతి రోజు కార్బోహైడ్రేట్లు ప్రోటీన్ విటమిన్లు ఖనిజలవణాలు ఉండేటట్లు సమతుల ఆహారం తీసుకోవాలని తల్లులందరికి తెలియజేసిన మైనది అలాగే అంగన్వాడీ కేంద్రాల వల్ల వారికి ఎలాంటి ఉపయోగాలు ఉన్నాయని తల్లులచే మాట్లాడించగా వారి యొక్క పిల్లలకు ఇచ్చేటువంటి పోషకాహారం మరియు పూర్వ ప్రాథమిక విద్య అన్నీ కూడా వారికి లాభదాయకంగా ఉన్నాయని తల్లిలందరు తెలియజేయడం జరిగింది. అలాగే హెల్త్ డిపార్ట్మెంట్ నుంచి ఇచ్చేటువంటి వ్యాధి నిరోధక టీకాలు వాటి యొక్క ప్రాముఖ్యతను గురించి వివరించడం ఈ కార్యక్రమంలో ప్రీస్కూల్ తల్లులను సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమం నందు సూపర్వైజర్ ఎం పద్మ అంగన్వాడీ కార్యకర్తలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



కీసర, దమ్మాయిగూడ బండ్లగూడ పరిధిలో ఉన్నటువంటి ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్ యార్డును సందర్శించిన డిస్టిక్ డి ఎం ఆఫీసర్ రియాజ్, మరియు ఏఎంసి ఆఫీస్ సెక్రటరీ జాన్ వెస్లీ, మేడ్చల్ ఏఎంసి డైరెక్టర్ ఈగ శ్వేతా రాజు ముదిరాజ్, మరియు దిలీప్, డిగు, ఏఎంసి ఆఫీస్ స్టాప్ తదితరులు పాల్గొన్నారు.
**కీసర, దమ్మాయిగూడ, సెప్టెంబర్ 30(వార్తా ప్రభ)**

## కొండాపూర్ జిల్లా ఆసుపత్రిని అన్నివసతులతో అభివృద్ధి చేసి పేదలకు అందుబాటులోకి తెస్తాం. - ఏం.ఎల్.ఏ.గాంధీ



. **శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ):**కొండాపూర్ జిల్లా ఆసుపత్రిలో మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే సీడీపీ/ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు పంపిన ప్రతిపాదన పత్రాలను పీఏసీ చైర్మన్,ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ బుధవారం ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రకృష్ణకు అందజేశారు.నిధులు మంజూరైన వెంటనే పనులను ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేస్తామని గాంధీ తెలిపారు.కొండాపూర్ జిల్లా ఆసుపత్రిని అన్ని వసతులతో అభివృద్ధి చేసి పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఆసుపత్రిలో 100 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, త్వరలోనే అందుబాటులోకి వస్తాయని తెలిపారు.ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని, సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

# దాములూరు ఎస్ఎంసీ ఎన్నికల్లో ఉత్కంఠత

### ఆధిపత్యం కోసం అధికార పార్టీ నేతల ఆరాటం

**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 30 (వార్తా ప్రభ ప్రతినిధి):** వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య గొడవతో మంగళవారం జరగాల్సిన ఎన్నిక నిలిచిపోయింది. బుధవారానికి వాయిదా వేసినా ఎన్నిక జరగలేదు. పాఠశాలల్లో అధికార పార్టీ నేతల ఆధిపత్యం కోసం ఎన్నిక జరపకుండా వాయిదా వేయించినట్లు తెలుస్తోంది. ఓటమి భయంతో అధికార పార్టీ నేతలు ఇక్కడ ఎన్నిక జరపకుండా చేశారని సమాచారం. గురువారం జరగనున్న ఎన్నికలో గెలుపు కోసం ఓట్లు కొనుగోలు చేస్తున్నట్లు తెలిసింది. ఎస్ఎంసీ ఎన్నికలకు రాజకీయ రంగు పులుముకోవడం విమర్శలకు తావిస్తోంది.

# మంచి నీటి వృధాను అరికట్టిన బిజెపి నాయకుడు సురేష్



**కూకట్ పల్లి, సెప్టెంబర్ 30(వార్తా ప్రభ):**ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పీజేఆర్ నగర్‌లో మ్యాన్ హోల్ దగ్గర మంచి నీళ్లు వృధాగా పారుతుండగా స్థానికులు బిజెపి ఆల్విన్ కాలనీ డివిజన్ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు సురేష్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన, వాటర్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ అధికారులతో మాట్లాడి లీకేజీని అరికట్టాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అనంతరం స్వయంగా దగ్గరుండి సిబ్బందిచే సమస్యను పరిష్కరింపజేశారు.కాలనీలో ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కరించే సురేష్ స్థానికులు అభినందించారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రాజు,సిద్దు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా కమిటీ ఎన్నికలు ఏకగ్రీవం



**పెనుగంచిప్రోలు - సెప్టెంబర్ 30( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు మండలం లోని అనిగండ్లపాడు గ్రామంలో విద్యా కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి.జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ గా పిట్టల శైలజ, వైస్ చైర్మన్ గా వల్లంశెట్టి శిరీష(తెలుగుదేశం పార్టీ),మండల ప్రజా పరిషత్ మెయిన్ స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ గా వల్లంశెట్టి నాగకృష్ణ, వైస్ చైర్మన్ గా గుడ్ల. సౌజన్య(తెలుగుదేశం పార్టీ)మండల ప్రజా పరిషత్ హరిజనవాడ స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ గా దోసపాటి.జ్యోతి, వైస్ చైర్మన్ గా రెడిపొంగు లక్ష్మణరావు( వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ)తెలుగుదేశం పార్టీ తరఫున ఎన్నికైన చైర్మన్ లు మరియు వైస్ చైర్మన్ లకు సీనియర్ నాయకులు సొసైటీ అధ్యక్షులు అత్తులూరి అచ్యుతరావు, గ్రామ పార్టీ అధ్యక్షులువల్లం కొండ.నరసింహారావు, తొట్టెంపూడి మురళి,పొందూరు గోపి తదితరులు పాల్గొని సన్మానించి, అభినందనలు తెలియజేశారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎన్నికైన విద్యా కమిటీ చైర్మన్ మరియు వైస్ చైర్మన్ లను గ్రామ పార్టీ అధ్యక్షులు ఉన్నాం శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కనకపూడి భాస్కరరావు, కొత్తపల్లి పెంటయ్య, గింజుపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొని అభినందించి సన్మానించారు,ఈ కార్యక్రమంలో గ్రామ ఇరుపార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఘనంగా నందం పద్మావతి సంస్మరణ సభ

● చిన్న వయసులోనే మృతి చెందడం తీవ్ర విషాదకరం.. ● జ్ఞాపకాలు ఎప్పటికీ మనతోనే....





**మచిలీపట్నం సెప్టెంబర్ 30:(వార్తా ప్రభ ప్రతినిధి)**సీనియర్ పాత్రికేయులు, కథా, నవలా రచయిత నందం రామారావు కుమార్తె నందం పద్మావతి సంస్మరణ సభ బుధవారం మచిలీపట్నం బైపాస్ రోడ్డులోని మిర్యాల ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించిన పలువురు ప్రముఖులు, ఆమెతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.సంస్మరణ సభకు ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మార్కెట్ యార్డు చైర్మన్ కుంచె నాని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వార్త ప్రభ ఎడిటర్ శ్రీరామ్ యాదవ్, పల్లె క్రాంతి ఎడిటర్ నాగరాజుతో పాటు పలువురు రాజకీయ, సామాజిక ప్రముఖులు, పాత్రికేయులు, నందం రామారావు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు హాజరయ్యారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. నందం పద్మావతి చిన్న వయసులోనే మృతి చెందడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులకు ఆమె మృతి తీరని లోటుగా మిగిలిందన్నారు. ఎంతో భవిష్యత్తు ఉన్న ఆమె దూరం కావడం కుటుంబ సభ్యులను తీవ్ర విషాదంలోకి నెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు.మనిషి భౌతికంగా దూరమైనప్పటికీ వారి జ్ఞాపకాలు, ఆత్మీయ అనుబంధాలు ఎప్పటికీ మనతోనే ఉంటాయని పలువురు పేర్కొన్నారు. పద్మావతితో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆమె వ్యక్తిత్వం, ఆత్మీయతను స్మరించుకున్నారు. ఆమెను ప్రేమించే ప్రతి ఒక్కరి హృదయాల్లో ఆమె జ్ఞాపకాలు చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు.నందం రామారావు కుటుంబానికి ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పద్మావతి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళు లర్పించారు. కార్యక్రమానికి హాజరైన వారు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి తమ సానుభూతిని వ్యక్తం చేశారు.పద్మావతి సంస్మరణ సభ లో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఆత్మీయులు ఆమెతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు.

# తిరుపతి నుంచి వారణాసికి 'సేవా సంకల్ప్' బైక్ యాత్ర

### - నాలుగు రాష్ట్రాల మీదుగా 8 రోజులు.. దేశ సేవ, ప్రజా సంక్షేమ సందేశంతో పయనం





**తిరుపతి, సెప్టెంబర్ 30:(వార్తా ప్రభ ప్రతినిధి):**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా చేపట్టిన తిరుపతి--వారణాసి సేవా సంకల్ప్ బైక్ యాత్ర బుధవారం తిరుపతి అలిపిరి వద్ద ఘనంగా ప్రారంభమైంది. తిరుమల శ్రీవారి ఆశీస్సులు కోరుకుని ప్రారంభమైన ఈ యాత్ర ఎనిమిది రోజుల పాటు నాలుగు రాష్ట్రాల మీదుగా సాగి వారణాసికి చేరుకోనుంది.ఈ యాత్రను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు, టీటీడీ బోర్డు సభ్యురాలు డా. పనబాక లక్ష్మి కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి జేబీ శ్రీనివాస్, సత్యవేడు నియోజకవర్గ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్ ప్రత్యేకంగా పాల్గొని యాత్రికులకు అభినందనలు తెలిపారు. దేశ సేవ, ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సేవా కార్యక్రమాల సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్మన్ మన్నూరు సుగుణమ్మ, ఎస్వీబీసీ చైర్మన్ శ్రీధర్ వర్మతో పాటు పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, దేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో సుపరిపాలన కొనసాగుతోందని నాయకులు పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు చేరువైన పాలన అందిస్తున్నారని తెలిపారు.ఈ బైక్ యాత్రలో 25 మంది తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు పాల్గొంటున్నారు. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల మీదుగా యాత్ర కొనసాగనుంది. ప్రజా సేవ, దేశాభివృద్ధి, సంక్షేమం, సేవా సంకల్పం అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే యాత్ర ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

# నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు..

● నైపుణ్యాభివృద్ధికి జయప్రద ఫౌండేషన్ కృషి ● సేవా కార్యక్రమాలతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి



**జగ్గయ్యపేట, సెప్టెంబర్ 30 (వార్తాప్రభ)**జగ్గయ్యపేట నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు, వారిలో నైపుణ్యాలను పెంపొందించేందుకు జయప్రద ఫౌండేషన్ పలు కార్యక్రమాలను చేపడుతోందని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.2018లో ప్రారంభమైన జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పలు గ్రామాలను దత్తత తీసుకొని వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆరోగ్య సేవల్లో భాగంగా అనేక వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు, సుమారు వేల మందికి కళ్లజోళ్ల పంపిణీ చేసినట్లు తెలిపారు.
క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు, మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతో పలు కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు.
**యువతకు ఉద్యోగాలే లక్ష్యం** నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు జయప్రద ఫౌండేషన్ ప్రత్యేక దృష్టి సారించింది. ఇటీవల శుభమస్తు కళ్యాణ మండపంలో నిర్వహించిన జాబ్ మేళాకు భారీగా యువత హాజరైనట్లు తెలిపారు. బుధవారం 56 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరైనట్లు వెల్లడించారు.నైపుణ్యం కలిగిన కంపెనీలను జగ్గయ్యపేటకు తీసుకువచ్చి స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఇన్ఫోసిస్ సంస్థతో ఉద్యోగ ఎంపిక క్యాంపు నిర్వహించినట్లు తెలిపారు. ఇకపై కంపెనీలు తమకు తేదీలు కేటాయించినప్పుడల్లా జగ్గయ్యపేటలో ఉద్యోగ ఎంపిక క్యాంపులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.
**ఇన్ఫోసిస్‌తో స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం**జగ్గయ్యపేట యువతకు మరింత మెరుగైన ఉద్యోగ అవకాశాలు అందించేందుకు ఇన్ఫోసిస్ సంస్థతో స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడానికి చర్చలు జరిపినట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఉద్యోగాలకు వెళ్లే ముందు యువతకు అవసరమైన నైపుణ్యాలను అందించేలా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు.
**మహిళా రైతుల ఆర్థిక అభివృద్ధికి సహకారం** కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో మహిళా రైతులతో కలిసి పనిచేస్తున్న సంస్థలతో సమన్వయం చేసుకుంటూ గ్రామీణాభివృద్ధి, రైతుల ఆర్థిక స్థితిగతుల మెరుగుదల, సాధికారత కోసం కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. లింగాల, పోచవరం ప్రాంతంలోని గంగెల్లి పరిసర ప్రాంతాల అభివృద్ధి, ప్రజల సాధికారతకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా పరిశీలన చేస్తున్నట్లు పేర్కొన్నారు.
**మహిళల సాధికారతకు ప్రాధాన్యం**మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొంటూ మహిళలకు మార్కెట్ స్కిల్స్, ఉపాధి ఆధారిత నైపుణ్యాలను నేర్పించే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. నారాయణ సేవ సంస్థ తదితర సంస్థల సహకారంతో మహిళలను వివిధ రంగాల్లో ఉపాధి అవకాశాల వైపు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు.జయప్రద ఫౌండేషన్ సేవా కార్యక్రమాలకు నియోజకవర్గంలోని ప్రజలు, నాయకులు, వివిధ రంగాల్లోని ప్రముఖులు అందిస్తున్న సహకారానికి ఫౌండేషన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఫౌండేషన్ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా అందిస్తున్న సహకారానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత, ఆరోగ్య సేవలు, గ్రామీణాభివృద్ధి వంటి అంశాలపై తమ సేవా కార్యక్రమాలను మరింత విస్తరించనున్నట్లు జయప్రద ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.

# గాంధీ హిల్‌పై అక్టోబరు 2న ఘనంగా జరగనున్న గాంధీ జయంతి వేడుకలు




**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 30 :(వార్త ప్రభ ప్రతినిధి)**గాంధీ జయంతిని పురస్కరించుకుని గాంధీ హిల్ ఫౌండేషన్ మరియు ఆంధ్రప్రదేశ్ గాంధీ స్మారక నిధి సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబరు 2వ తేదీ శుక్రవారంనాడు విజయవాడ గాంధీ హిల్‌పై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గాంధీ హిల్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ గాంధీ పి.సి. కాజా తెలిపారు. గాంధీ హిల్‌లోని కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గాంధీ మాట్లాడుతూ, గాంధీ మహాత్మునికి నివాళులు, గాంధీజీ సిద్ధాంతాలైన శాంతి, అహింస, మరియు జాతీయ సమైక్యతపై అవగాహన కార్యక్రమాలు, విద్యార్థులు, యువత భాగస్వామ్యంతో సాంస్కృతిక మరియు విద్యా కార్యక్రమాల ప్రోత్సాహం, గాంధీ హిల్ మరియు దాని ఆశ్రమాల చరిత్ర ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు, స్మారక ప్రచురణలు, పుస్తకాల ఆవిష్కరణ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. గాంధీ జయంతి నాడు జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెంట్రల్ విజిలెన్స్ మాజీ కమిషనర్ కె.వి.చౌదరి, విశిష్ట అతిథిగా ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బి.ఎస్. మూర్తి హాజరవుతారని తెలిపారు. విలేకరుల సమావేశంలో మాజీ మేయర్ జంధ్యాల శంకర్, గాంధీ హిల్ ట్రెజరర్ శివ శంకర్, డి.శంకరరావు, రావి శారదా, జి.రష్మి, గాంధీ హిల్ మేనేజర్ యు.రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

# భారీగా చెరువు పూడిక మట్టిని డంపింగ్ చేస్తున్నారు అడ్డుకోండి.

### -మాజీ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి



. **శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ):**గోపన్‌పల్లి వికర్ సెక్షన్ సమీపంలో భారీగా చెరువు పూడిక మట్టిని డంపింగ్ చేస్తున్నారని ఆరోపిస్తూ గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ వి.గంగాధర్‌రెడ్డి స్థానికులతో కలిసి నిరసన చేపట్టారు.నల్లగండ్ల, నానక్‌రామ్‌గూడ, కోకాపేట తదితర ప్రాంతాల నుంచి వందలాది ట్రిప్పుల మట్టి తెచ్చి పోస్తున్నారని తెలిపారు. మట్టి కుప్పలతో ఇళ్లకు,సహజ నీటి ప్రవాహ మార్గాలకు ముప్పు ఉందన్నారు.డంపింగ్ అనుమతులు,మట్టి తరలింపు వివరాలను అధికారులు వెల్లడించాలని డిమాండ్ చేశారు.ఇప్పటికే వేసిన మట్టిని తొలగించి,డంపింగ్‌ను నిలిపివేయాలని కోరారు.అనంతరం ఆర్ఐ ఇంద్రసేనరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

# సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల కల్పనకు జయప్రద ఫౌండేషన్ కృషి



**జగ్గయ్యపేట, సెప్టెంబర్ 30 (వార్తప్రభ):**స్థానిక యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రత్యేక జాబ్ డ్రైవ్ నిర్వహించారు.సెప్టెంబర్ 13న జగ్గయ్యపేటలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో పాల్గొన్న అభ్యర్థులకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ ప్రత్యేక జాబ్ డ్రైవ్‌ను ఏర్పాటు చేశారు. జగ్గయ్యపేట ఫుడ్ ప్లాజాలో టెకలైన్స్ ఇన్నోవేటివ్ ప్రవేట్ లిమిటెడ్ . ఆధ్వర్యంలో జాబ్ డ్రైవ్ నిర్వహించారు.ఈ జాబ్ డ్రైవ్‌ను జాతీయ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ, ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చైర్మన్, జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్దన్ పరిశీలించారు. ఈ సందర్భంగా జాబ్ డ్రైవ్‌కు హాజరైన అభ్యర్థులతో ఆయన మాట్లాడి, ఉద్యోగ ఎంపిక ప్రక్రియ, అందుబాటులో ఉన్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగ అవకాశాలు, సంస్థ కల్పిస్తున్న ఉపాధి అవకాశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.యువతకు కేవలం ఉద్యోగ మేళాలు నిర్వహించడం మాత్రమే కాకుండా, వారి అర్హతలకు తగిన ఉద్యోగాలు లభించే వరకు అవసరమైన సహకారం అందించడమే జయప్రద ఫౌండేషన్ లక్ష్యమని తొండపు దశరథ జనార్దన్ తెలిపారు.స్థానిక యువతకు సాఫ్ట్‌వేర్, ఐటీతో పాటు ఇతర ప్రైవేట్ రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు భవిష్యత్తులో కూడా వివిధ పరిశ్రమలు, సంస్థలతో కలిసి మరిన్ని జాబ్ డ్రైవ్‌లు నిర్వహిస్తామని చెప్పారు.యువత తమ నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకుని, అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

# రైతు బజార్ లో ఉల్లిపాయలు కేజీ@ 35



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 30(వార్తా ప్రభ ప్రతినిధి):**ఇబ్రహీంపట్నం రైతు బజార్లో ఉల్లిపాయల అమ్మకానికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు... అవసరమైన వాళ్ళు కేజీ 35 రూపాయలకే కిలో ఉల్లిపాయలు కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు... బుధవారం నాడు అమ్మకాల కేంద్రాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాసరావు, టిడిపి కస్టర్ ఇంచార్జ్ మరియు కౌన్సిలర్ నారాయణరావు, మార్కెట్ యాడ్ డైరెక్టర్ ఉమామహేశ్వరారావు, రైతుబజార్ సిబ్బంది పాల్గొన్నారు.

# డాక్టర్ జాకీర్ హుస్సేన్ కళాశాలలో ఉమ్మడి కృష్ణాజిల్లా క్రికెట్ సెలక్షన్స్



**ఇబ్రహీంపట్నం,సెప్టెంబర్ 30(వార్తా ప్రభ ప్రతినిధి):**స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 19 ఇయర్స్ సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణాజిల్లా క్రికెట్ సెలక్షన్స్ తమ కళాశాల క్రికెట్ మైదానంలో బుధవారం నిర్వహించబడినట్లు డాక్టర్ జాకీర్ హుస్సేన్ కళాశాల ప్రిన్సిపల్ జాఫర్ సాదిక్ తెలిపారు . ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రిన్సిపాల్ ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని వివిధ కళాశాలకు చెందిన 200 మంది బాల బాలికలు ఈ పోటీలో పాల్గొన్నారన్నారు.ఈ పోటీలు నిర్వహించిన స్కూల్ గేమ్ ఫెడరేషన్ జిల్లా సెక్రెటరీ వి .రవికాంత మాట్లాడుతూ ఈ పోటీలలో ఉమ్మడి కృష్ణాజిల్లా బాల ,బాలికల క్రికెట్ జట్టును ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇక్కడ ఎంపికైన జట్లు చిత్తూరు జిల్లా తిరుపతిలో జరగనున్న 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 19 స్టేట్ మీట్ లో కృష్ణాజిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తా రన్నారు.ఈ ఎంపిక ప్రక్రియలో సెలక్టర్లుగా సుందర్, అవినాష్, రఘురాం ,కె.వి నారాయణ ,శివలక్ష్మి లు వ్యవహరించారు.

# కుంచెతో కలలకు రంగులద్దిన చిన్నారులు

-రోటరీ యువజన వారోత్సవాల్లో సృజనాత్మక సందడి



**గుడివాడ,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** పుస్తకాలకే పరిమితం కాకుండా, విద్యార్థుల్లోని సృజనాత్మకతకు రెక్కలు తొడిగేలా రోటరీ క్లబ్ గుడివాడ చేపట్టిన యువజన వారోత్సవాలు ఆకట్టుకుంటున్నాయి. ఈ వారోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన చిత్రలేఖన పోటీలు చిన్నారుల ఊహాలకు అద్దం పట్టాయి. రాజేంద్రనగర్ 8వ లైన్ లోని జి.వి. పూర్ణచంద్రరావు రోటరీ భవన్ వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో ఒకటవ తరగతి చిన్నారి నుంచి పదవ తరగతి యువత వరకు వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రకృతి, పర్యావరణం, దేశభక్తి, సమాజం వంటి అంశాలపై తమ మనసులోని భావాలను కుంచెతో కాగితంపై ఆవిష్కరించారు. పోటీ అనేది కేవలం గెలుపోటములకు కాదు, తమలోని ప్రతిభను వెలికితీయడానికి ఒక వేదిక అని నిరూపించారు. విద్యార్థులను ప్రోత్సహించడానికి రోటరీ క్లబ్ అధ్యక్షులు గుళ్లపల్లి కిరణ్ బాబు, కార్యదర్శి గండు నరేష్, కోశాధికారి కొల్లి శ్రీనివాస్, పూర్వ అసిస్టెంట్ గవర్నర్ ముళ్ళపూడి రమణమూర్తి, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, రుద్రరాజు శ్రీనివాసరాజు తదితరులు హాజరై చిన్నారులను అభినందించారు.

# బిల్డింగ్ వర్కర్స్ సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలి - సీఐటీయూ డిమాండ్



**గుడివాడ,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** భవన నిర్మాణ కార్మికులకు గతంలో అమలు చేసిన అన్ని సంక్షేమ పథకాలను పునరుద్ధరించి, వెల్ఫేర్ బోర్డు ద్వారా నిజమైన ప్రయోజనం కల్పించాలని కృష్ణాజిల్లా సీఐటీయూ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. కార్మికుల సుదీర్ఘ పోరాటాల అనంతరం 2026 మార్చి 1 నుంచి బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డును పునఃప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ, కొన్ని ప్రయోజనాలను మాత్రమే అందిస్తూ మిగతా పథకాలను పక్కన పెట్టిందని యూనియన్ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అధిక సంఖ్యలో కార్మికులకు లబ్ధి చేకూరడం లేదన్నారు. ఈ మేరకు కార్మిక శాఖ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు రేపానికొండ, జిల్లా కోశాధికారి వేము పెదబాబు, జిల్లా కమిటీ సభ్యురాలు తమ్మిశెట్టి నాగ, గుడివాడ తాపీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఓలేటి సీతారామయ్య, నాయకులు భైరవ, వి.వెంకటేశ్వరరావు, జహారుద్దీన్ ఖాన్, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఓ.గంగాధర్, శ్రీనివాసరావు, ఇంటి రాజు, అబ్దుల్ నజీర్, జోజిరావు, బొంతు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# అక్షర సేవకు అరుదైన గౌరవం

-జాతీయ అవార్డు గ్రహీత పుట్టి నాగలక్ష్మికి గుడివాడలో ఆత్మీయ సత్కారం



**గుడివాడ,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** హైదరాబాద్ లోని ప్రతిష్ఠాత్మక వంశీ రామరాజు సంస్థ వారి నుండి వంశీ, ఎ.యన్.ఆర్. కామధేను జాతీయ అవార్డును స్వీకరించిన గుడివాడకు చెందిన ప్రముఖ రచయిత్రి, కవయిత్రి, స్టాంపుల సేకర్త, పుట్టి వెంకటేశ్వరావు సామాజిక సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు పుట్టి నాగలక్ష్మి ని స్థానిక కృష్ణా ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ నేతలు అభినందించి, ఆత్మీయ సత్కారాన్ని అందించారు. పి.వి.సత్యనారాయణ, నరహరిశెట్టి ప్రసాద్, మట్టా రాజా, మారడాని వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే కె.ఆర్.అప్పారావు, గాంధీ బాబు, ధనేశ్వరి, విమల, కొడాలి సోమసుందరరావు, బండారు శ్యాంకుమార్, డ్నిఆర్.బి.ప్రసాద్, జిప్రమీల, సత్యశ్రీ, భారతి, సునీత, సుమలత, సాయిసుధ, వంశీ, వసుధ, యం.వి.జి.ఆంజనేయయులు, చిరంజీవి, రాఘవాచారి, మోకా మాధవరావు, మల్లిక్, ఆర్వీయల్ నరసింహారావు, పల్లెబాట రాజా తదితరులు ఆమెను అభినందించారు.

# ఆగిరిపల్లిలో అక్టోబర్ 1న కిసాన్ మేళా

రైతుల సందేహాల నివృత్తికి వ్యవసాయ, ఉద్యాన శాఖల ఆధ్వర్యంలో నిర్వహణ



**ఆగిరిపల్లి,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** ఆగిరిపల్లి మండలంలోని రైతుల కోసం అక్టోబర్ 1న కిసాన్ మేళా నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి జె. భవాని తెలిపారు. గురువారం ఉదయం 10.30 గంటలకు ఆగిరిపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని మాదల సత్యకుమార్ మామిడి తోటలో వ్యవసాయ, ఉద్యాన శాఖల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. కిసాన్ మేళాలో జిల్లా వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు పంటల సాగు, ఉద్యాన పంటలపై సూచనలు అందించడంతో పాటు వారి సందేహాలను నివృత్తి చేయనున్నారు. మండలంలోని వ్యవసాయ, ఉద్యాన శాఖల రైతులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జె. భవాని కోరారు.

# మోదీ స్ఫూర్తితో సేవకు సన్మానం..

● అంగన్‌వాడీ వర్కర్లను సత్కరించిన బీజేపీ నేతలు



**గుడివాడ,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా చేపట్టిన 'సేవా సంకల్ప అభియాన్' కార్యక్రమంలో భాగంగా పెద్ద ఎరుకుపాడులో అంగన్‌వాడీ కార్యకర్తలను బీజేపీ నేతలు ఘనంగా సన్మానించారు. ముందుగా పాఠశాల ఆవరణలో మోదీ పేరు మీద మొక్క నాటిన నేతలు, అనంతరం అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు 30 రోజుల పాటు దేశవ్యాప్తంగా సేవలు అందిస్తున్న వివిధ వృత్తుల వారిని సన్మానించడం ద్వారా వారి సేవలను గుర్తించడమే ఈ అభియాన్ లక్ష్యమని తెలిపారు. 25 సంవత్సరాలుగా ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా ఎలాంటి మచ్చలేని సేవలందిస్తున్న మోదీ నాయకత్వంలో దేశం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు ఆలపాటి లక్ష్మీనారాయణ, సూరే గాంధీ, కోనేటి వెంకటేష్, మాచర్ల రామకృష్ణ, మేక శ్రీనివాస్, సొంటి అయ్యప్ప, గాదంశెట్టి ఫణికుమార్, కనకదుర్గ, బోనం గోపిక, దేవరపల్లి చిన్న, సాయి తదితరులు పాల్గొన్నారు.

**జిల్లా నాయకులు వల్లపర్ల అధ్వర్యంలో..** స్థానిక 11వ వార్డు లోని అంబేద్కర్ విగ్రహం వద్ద బిజెపి జిల్లా నాయకులు వలపర్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంకు ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర నాయకులు మట్టా ప్రసాద్, లింగం చిట్టిబాబు లు పాల్గొని పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. తొలుత బాబా సాహెబ్ డా॥ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సూరే గాంధీ, పిల్లి మురళి, కొత్త కిరణ్, ఫణి తదితరులు పాల్గొన్నారు.



# 'పేదలకు పట్టాభిషేకం'సభకు తరలివెళ్లిన లబ్ధిదారులు

● కుంటముక్కల గ్రామానికి చెందిన 92 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ

● సీఎం బహిరంగ సభకు వెళ్తున్న లబ్ధిదారులకు ఆహారం, మజ్జిగ ప్యాకెట్లు అందజేసిన టీడీపీ నాయకులు





**జి.కొండూరు(కుంటముక్కల),సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పేదలకు పట్టాభిషేకం'ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా బుధవారం (సెప్టెంబర్ 30, 2026) విజయవాడలోని మాకినేని బసవన్నయ్య స్టేడియంలో జరిగిన భారీ బహిరంగ సభ కు జి.కొండూరు మండలం, కుంటముక్కల గ్రామానికి చెందిన 92 మంది మంది లబ్ధిదారులు స్థానిక రెవిన్యూ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆర్ టి సి బస్సు లో తరలివెళ్లారు. వీరికి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి లంక నాగేశ్వరరావు, కుంటముక్కల పిఏసిఎస్ చైర్మన్ సుఖవాసి శ్రీహరి గ్రామ పార్టీ నాయకులతో కలిసి ఆహారం, మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. ఈ భారీ బహిరంగ సభకు లబ్ధిదారులు ఎంతో ఉత్సాహంతో తరలి వెళ్లారు. కుంటముక్కల గ్రామంలో మొత్తం 92 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపిణీ చేసినట్లు రెవెన్యూ అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నా రు.

# జనతా చైతన్య కార్యక్రమంలో సైబర్ నేరాలు, మైనర్ డ్రైవింగ్‌పై అవగాహన





**హనుమాన్ జంక్షన్, సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం ఉమామహేశ్వరపురం గ్రామంలో హనుమాన్ జంక్షన్ సీఐ ఎల్ రమేష్ సూచనల మేరకు వీరవల్లి ఎస్ ఐ సత్యం సురేష్ ఆధ్వర్యంలో జనతా చైతన్య కార్యక్రమంలో భాగంగా డిజిటల్ అరెస్టులు, సైబర్ నేరాలు, మైనర్ డ్రైవింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సత్యం సురేష్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీసుల పేరుతో ఫోన్ చేసి భయపెట్టి డబ్బులు వసూలు చేసే డిజిటల్ అరెస్ట్ మోసాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దన్నారు. అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాలు, లింకులకు స్పందించకుండా వ్యక్తిగత, బ్యాంకు వివరాలను ఎవరికీ వెల్లడించరాదని తెలిపారు. అలాగే మైనర్లు వాహనాలు నడపడం ప్రమాదకరమని, తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని, రహదారి భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ కోరారు. సైబర్ నేరాలపై అప్రమత్తతతో పాటు మైనర్ డ్రైవింగ్ నివారణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన సూచించారు.

# వాకింగ్ ట్రాకర్ కు సిమెంట్ బల్లలు ఏర్పాటు



**విస్సన్నపేట,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో కోనేరు వాకింగ్ ట్రాకర్ పై లలితా సూపర్ బజార్ పార్ట్నర్ కోనేరు పనుల కాంట్రాక్టర్ కే రామకృష్ణ సిమెంట్ బల్లలు వితరణగా అందించారు. వైభవ్ జ్యూయలరీ మార్ట్ అధినేత కె.వి నాగేశ్వరరావు ఫల పుష్ప ఔషధ మొక్కలను ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టినట్టు తెలిసింది. ఇప్పటికే సోలార్ లైట్లు వెలుగులు ఓపెన్ జిమ్ యూనిట్ల సరఫరాతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందేందుకు తెలుగింటి ఆడపడుచులు అవ్వ తాతలు విద్యార్థినీ విద్యార్థులు వందలాది మంది ఉదయం సాయంత్రం రాత్రి వినియోగించుకోవడం జరుగుతుంది.

# సింగ్‌నగర్ సభకు టీడీపీ శ్రేణుల భారీ ర్యాలీ

చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన చెవులు ఆంజనేయులు





**విజయవాడ పశ్చిమ,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** కూటమి ప్రభుత్వం సింగ్‌నగర్ స్టేడియంలో బుధవారం నిర్వహించిన'పట్టాదారులకు పట్టాభిషేకం' కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ఊర్మిళానగర్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త చెవులు ఆంజనేయులు టీడీపీలో చేరారు. టీడీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుద్ధా వెంకన్న నేతృత్వంలో ఆంజనేయులు స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ బైక్ ర్యాలీగా సభకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య మాట్లాడుతూ చంద్రబాబు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ఆంజనేయులు పార్టీలో చేరారని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆయనకు అండగా నిలుస్తామని చెప్పారు. చెవులు ఆంజనేయులు మాట్లాడుతూ చంద్రబాబు, నారా లోకేష్, కేశినేని చిన్ని, బుద్దా వెంకన్న నాయకత్వంలో పనిచేసేందుకు యాదవ సామాజిక వర్గం తరఫున పార్టీలో చేరినట్లు తెలిపారు. పోలవరం, వెలిగొండ ప్రాజెక్టులతో పాటు రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తనను ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు.

# పదహారు కోట్లు దాటిన ముక్కొల్లు సొసైటీ టర్నోవర్

● జనరల్ బాడీ సమావేశంలో ప్రకటించిన చైర్మన్ సమ్మెట



**పెడన,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గం గూడూరు మండలం లోని ముక్కొల్లు సొసైటీ టర్నోవర్ 16 కోట్ల రూపాయలు దాటిందని సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ సమ్మెట రాఘవ ప్రసాద్ చెప్పారు. సొసైటీ సర్వసభ్య సమావేశం బుధవారం నాడు అయన అధ్యక్షతన సొసైటీ లో జరిగింది. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పి ఎ సి ఎస్) సేవలను రైతులు సద్వినియోగించుకోవాలని రాఘవ ప్రసాద్ కోరారు. ఈ సందర్భంగా సమ్మెట రాఘవ ప్రసాద్ మాట్లాడుతూ సొసైటీ పరిధిలో 585 మందికి ఋణాలు ఇచ్చామని వెల్లడించారు 370 మందికి స్వల్పకాలిక ఋణాలు 2.66 కోట్ల వరకు మంజూరు చేయటం జరిగిందన్నారు. దీర్ఘకాలిక ఋణాలు 12.94 కోట్ల మంజూరు చేయడం జరిగిందని తెలిపారు తాము బాధ్యతలు స్వీకరించాక సొసైటీ టర్న్ ఓవర్ 16 కోట్లకు దాటిందన్నారు కార్యక్రమంలో పర్సన్స్ ముక్కు సుబ్రహ్మణ్యేశ్వర రావు శాఖల మహంకాళి రావు మాజీ బ్యాంక్ ప్రెసిడెంట్ సమ్మెట వీర వెంకట సత్యనారాయణ స్వామి సమ్మెట తులసి రావు సంఘ సభ్యులు సొసైటీ సీఈఓ కోలపల్లి భూషయ్య పాల్గొన్నారు.

# మల్లవోలులో అంగన్వాడి ఉత్సవం




**పెడన,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గం గూడూరు మండలంలోని మల్లవోలు గ్రామంలో బుధవారం నాడు అంగన్వాడి ఉత్సవం జరిగింది. సమగ్ర శిశు అభివృద్ధి పథకం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గ్రామంలోని పత్తిపాటివారి వీధి అంగన్వాడీ కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ జన్ను రేవతి మాట్లాడుతూ మహిళలు ముఖ్యంగా గర్భిణీలు విటమిన్లతో కూడిన పోషకాహారం తీసుకోవాలని సూచించారు. తల్లి బిడ్డల క్షేమమే సమాజ అభివృద్ధికి సూచిక అన్నారు. అంగన్వాడీ టీచర్ రాజరాజేశ్వరి హెల్పర్ విజయ తదితరులు పాల్గొన్నారు

# గుర్తుతెలియని మృతదేహం ఆచూకీ కోసం మైలవరం పోలీసుల గాలింపు



**మైలవరం,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** గుర్తుతెలియని మృతదేహం ఆచూకీ కోసం మైలవరం పోలీసుల గాలిస్తున్నారు. మైలవరం పట్టణ పరిసర ప్రాంతాల్లో సుమారు నెల రోజులుగా సంచరిస్తూ కనిపించి న, సుమారు 60 నుంచి 70 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన గుర్తుతెలియని మగ వ్యక్తి స్థానిక యల్ బి ఆర్ సి ఇ సమీపంలోని దర్గా వద్ద కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఉన్నట్లు పోలీసు లు బుధవారం వెల్లడించారు. సదరు వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతుండగా, ఈ నెల అనగా సెప్టెంబర్ 24, 2026 న మైలవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించ గా, వైద్య చికిత్స పొందుతూ మృతి చెందినట్లు నిర్ధారణ అయిందని తెలియజేశారు. ప్రాథమికం గా అనారోగ్యం కారణంగానే మృతి చెందినట్లు గుర్తించడం జరిగిందన్నారు. మృతుని నోరు తెరిచి ఉండటం వలన పళ్లకు సంబంధించిన ఆనవాళ్లు స్పష్టంగా కనిపించాయి. పై దవడలోని కొన్ని పళ్లు ఊడిపోయి ఉండగా, ఒక పన్ను మాత్రం స్పష్టంగా కనిపిస్తుందని,మృతుని వద్ద అతని వివరాలు లేదా గుర్తింపును నిర్ధారించడా నికి ఉపయోగపడే ఎలాంటి గుర్తింపు పత్రాలు, వస్తువులు లేదా ఇతర ఆధారాలు లభించలేదని పోలీసులు పేర్కొన్నారు. పై ఆనవాళ్ల ఆధారంగా సదరు వ్యక్తిని ఎవరైనా గుర్తించినా, లేదా ఇతను తమ బంధువు/పరిచయస్తుడని తెలిసినా వెంటనే మైలవరం పోలీస్ స్టేషన్ ను సంప్రదించి సమాచారం అందించవలసిందిగా పోలీసులు కోరారు. 944079647 ఫోన్ నంబర్ ను సంప్రదిం చాలని కోరారు.

# స్వచ్ఛ రథానికి వ్యర్థాలు అందిస్తే దసరా కానుకలు!

● ఎక్కువ కేజీల వ్యర్థాలు అందించిన వారికి లాటరీ ద్వారా బహుమతులు

● పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని ఎంపీడీవో అబ్దుల్ సలాం, ఈఓఆర్డీ దుర్గారావు పిలుపు



**ఆగిరిపల్లి,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** ఆగిరిపల్లి మండల పరిధిలో ప్రతిరోజూ తిరుగుతున్న స్వచ్ఛ రథానికి ప్లాస్టిక్ వస్తువులు, అట్టలు, పేపర్లు, పాత పుస్తకాలు తదితర వ్యర్థాలను ఎక్కువ మోతాదులో అందించే వారి పేర్లను నమోదు చేయనున్నట్లు ఎంపీడీవో అబ్దుల్ సలాం, ఈఓఆర్డీ దుర్గారావు తెలిపారు. దసరా ఆఫర్‌లో భాగంగా నమోదైన పేర్లతో దసరా రోజున లాటరీ నిర్వహించి బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మొదటి బహుమతిగా డిన్నర్ సెట్, రెండో బహుమతిగా ఎలక్ట్రికల్ కేటిల్, మూడో బహుమతిగా వాటర్ బాటిల్స్ అందించనున్నట్లు తెలిపారు. ప్రజలు తమ ఇళ్లలోని పునర్వినియోగ వ్యర్థాలను స్వచ్ఛ రథానికి అందించి, గ్రామాల పరిశుభ్రతకు సహకరించాలని అధికారులు కోరారు.

# చెవుటూరులో ప్రమాదకరంగా ఆర్ అండ్ బి రహదారి

- గుంటలమయమైన రోడ్డు ను అభివృద్ధి చేయాలంటూ సీపీఎం నాయకులు డిమాండ్
- గుంటలు రోడ్డుపై కూర్చొని వినూత్నంగా నిరసన తెలిపిన సీపీఎం నేతలు







**జి.కొండూరు(చెవుటూరు),సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా, జి కొండూరు మండలం చెవుటూరు గ్రామంలో పలు చోట్ల మైలవరం డివిజన్ పరిధిలోని ఆర్ అండ్ బి రోడ్డు తీవ్రంగా దెబ్బతిని ప్రమాదకరంగా మారడంతో సీపీఎం నాయకులు గ్రామస్తులతో కలిసి బుధవారం గుంటలు రోడ్డుపై కూర్చొని వినూత్నంగా నిరసన తెలిపారు.ప్రజల ప్రాణాల కు ముప్పు వాటిల్లుతున్నా అధికారులు స్పందించకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంతలమయమైన రోడ్డు ను అభివృద్ధి చేయాలంటూ డిమాండ్ చేశారు.రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి, వర్షాలు కురిసినప్పుడు వాటి లో నీరు నిలవడంతో గుంతలు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు.ముఖ్యంగా ద్విచక్ర వాహన దారులు, ఆటోలు, విద్యార్థులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రని తెలిపారు. రహదారి పూర్తిగా ధ్వంసమై, అడుగడుగునా భారీ గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారినా ప్రభుత్వం, సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోక పోవడం ఏమిటని ప్రశ్నించారు.

**పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాలి : పి.వి.ఆంజనేయులు**

ప్రమాదాలను నివారించేందుకు రోడ్డుపై ఉన్న అన్ని గుంతలను తక్షణమే పూడ్చాలని, అనంతరం పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టి నాణ్యమైన రహదారిని నిర్మించాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.వి ఆంజనేయులు డిమాండ్ చేశారు.ప్రతిరోజూ ఈ రహదారి మీదుగా అనేక గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారని,అత్యవసర పరిస్థితు ల్లో ఆసుపత్రులకు వెళ్లే రోగులు, విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారని అన్నారు.చెవుటూరు గ్రామం ఎంట్రన్స్ మొదలుకొని గ్రామ శివారు వరకు రోడ్డంతా ధ్వంసమైనా కనీసం తాత్కాలికంగా గుంతలను పూడ్చేందుకు తట్టెడు మట్టి కూడా పోయలేని స్థితిలో ఆర్ అండ్ బీ అధికారులు వ్యవహరించ డం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించా రు.ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడే వరకు అధికారులు స్పందించకపోవడం సరికాద న్నారు.ప్రజా పాలన అంటూ గొప్పలు చెప్పుకుం టున్న ప్రభుత్వం ప్రజలు ఎదుర్కొంటున్న ఇంత తీవ్రమైన సమస్యపై తక్షణ చర్యలు తీసుకోవాల ని విజ్ఞప్తి చేశారు.మైలవరం నియోజకవర్గం అభివృద్ధి అంటే ఇదేనా? అని ఆంజనేయులు ప్రశ్నించారు.స్థానిక శాసనసభ్యులు వెంటనే స్పందించి నిధులు మంజూరు చేయించి రహదారి మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే జి కొండూరు మండలంలోని కట్టుబడిపాలెం గ్రామం వద్ద హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ కంపెనీ ఎదురుగా జాతీయ రహదారిపై పెద్ద పెద్ద గుంటలు ఏర్పడితే బార్కెడ్లు పెట్టారని, రాత్రివేళ వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు.రహదారి మ-రమ్మతు ల విషయంలో అధికారులు కాలయాపన చేయకుండా అత్యవసర చర్యల కోసం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కోరారు.ప్రభుత్వ యంత్రాంగం వెంటనే స్పందించి రోడ్డు సమస్యను పరిష్కరించకపోతే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని పి.వి. ఆంజనేయులు హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో మైలవరం సిపిఎం పార్టీ మండల కార్యదర్శి సిహెచ్ సుధాకర్, జి.కొండూరు సిపిఎం నాయకులు కోటేశ్వరరావు, మైలవరం రైతు సంఘం నాయకులు వజ్రాల వెంకటరెడ్డి,రావుల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# భారీ స్థాయి పారిశ్రామికత ద్వారా భారత ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన సహకారం అందిద్దాం

- అఖిల భారత ఆర్య వైశ్య పారిశ్రామికవేత్తల ఫోరం అధ్యక్షులు చారుగుండ్ల భవాని సురేష్






**విజయవాడ ,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** ఆర్య వైశ్య పారిశ్రామికవేత్తలు కలసి భారీ స్థాయి పారిశ్రామికత ద్వారా భారత ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన సహకారం అందిద్దామని అఖిల భారత ఆర్య వైశ్య పారిశ్రామికవేత్తల ఫోరం అధ్యక్షులు చారుగుండ్ల భవాని సురేష్ అన్నారు. విజయవాడలోని లెమన్ ట్రీ హోటల్ లో బుధవారం అల్ ఇండియా ఆర్య వైశ్య ఇండస్ట్రియలిస్ట్స్ ఫోరం ఆధ్వర్యంలో ఆర్య వైశ్య పారిశ్రామికవేత్తల ఇష్టాగోష్టి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల నుంచి 100 మందికి పైగా ఆర్య వైశ్య పారిశ్రామికవేత్తలు 150 మందికి పైగా ఇండస్ట్రీ ఓనర్స్, అలాగే తెలంగాణ నుండి 50 మందికి పైగా ఇండస్ట్రీ ఓనర్స్ ఒకే వేదికపై సమావేశమై పరస్పర పరిచయాలు, వ్యాపార సంబంధాలు, సహకార అవకాశాలపై చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా చారుగుండ్ల భవాని సురేష్ మాట్లాడుతూ "అనుసంధానం, సహకారం, వృద్ధి" నే లక్ష్యంతో దేశవ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్య పారిశ్రామికవేత్తలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, పరస్పర వ్యాపార కొత్త అవకాశాల సృష్టి, అభివృద్ధి, నాలెడ్జ్ షేరింగ్, నెట్‌వర్కింగ్ మరియు సమిష్టి అభివృద్ధికి బలమైన వేదికను నిర్మించడమే ఫోరమ్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఆధునిక పరిశ్రమ వ్యవస్థాపకులకు తమ కార్యకలాపాలను విస్తరించుకోవడానికి, ప్రపంచవ్యాప్తంగా నెట్‌వర్క్ చేసుకోవడానికి మరియు డిజిటల్ వ్యాపార వ్యూహాలను అవలంబించడానికి ఆర్యవైశ్య పారిశ్రామికవేత్తల ఫోరమ్ ను ఉపయోగించుకోవాలని కోరారు. ఆధునిక పరిశ్రమలు స్థాపించి క్షేత్రస్థాయిలో గణనీయమైన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు దేశ ఆర్థికాభివృద్ధికి కూడా పాటుపడాలని చారుగుండ్ల భవాని సురేష్ కోరారు . ఈ కార్యక్రమంలో ఫోరమ్ ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ పడకంటి, కోశాధికారి శివకుమార్ బొగ్గరి, సంయుక్త కార్యదర్శి వంశీ నేలంటి, ఉపాధ్యక్షులు ఎర్రం బాలకృష్ణ, పూర్వ అధ్యక్షులు రాంబాబు పబ్బిశెట్టి, ఆంధ్రప్రదేశ్ నాయకులు వెంకటేష్ కొల్లిపార, బాలసుబ్రహ్మణ్యం వేముల ఆంధ్ర ప్రదేశ్ ఫోరమ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# జరుగుమల్లి ఘటనపై మంత్రి సవిత ఆగ్రహం



**అమరావతి,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** ఒంగోలు జిల్లా జరుగుమల్లి బీసీ హాస్టల్ విద్యార్థినుల వేధింపుల ఘటనపై బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇద్దరు విద్యార్థినులపై అసభ్యకరంగా ప్రవర్తించిన నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని, ఇందుకు కారణమైన హాస్టల్ కుక్ ను విధుల్లో నుంచి తొలగించడమే కాకుండా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. విద్యార్థినులను, మహిళలను వేధించినా, లైగింక దాడులు చేసినా క్షమించేది లేదని, అదే నిందితులకు ఆఖరి రోజు అని హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఒంగోలు జిల్లా జరుగుమల్లి బీసీ హాస్టల్ లో చదువుతున్న ఇద్దరు విద్యార్థినులను ఒంగోలు నివాసముంటున్న రిటైర్డ్ ఉద్యోగి బొడ్డు వెంకట్రావు ఇంటికి కుక్ శారద మంగళవారం పంపింది. ఇంటికి వచ్చిన విద్యార్థినులతో రిటైర్డ్ ఉద్యోగి బొడ్డు వెంకట్రావు అసభ్యకరంగా ప్రవర్తించడంతో, బాధితులు తమ కుటుంబ సభ్యులకు ఫోన్ లో సమాచారమందించారు. ఘటనపై ఒంగోలు జిల్లా కలెక్టర్ రాజాబాబు, జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారులతో మంత్రి సవిత ఫోన్లో మాట్లాడారు. విద్యార్థినులపై అసభ్యకర వేధింపులు క్షమించరాని నేరమన్నారు. తక్షణమే నిందితుడు బొడ్డు వెంకట్రావును అరెస్టు చేయాలని ఆదేశించారు. వెంకట్రావు ఇంటికి ఇద్దరు బాలికలను పంపిన కుక్ శారదను విధుల నుంచి తొలగించడమే కాకుండా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేశారు. హాస్టల్ వార్డెన్ ను సస్పెండ్ ఛేయాలని బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణకు మంత్రి సవిత ఆదేశించారు. ఘటనపై తక్షణమే నివేదిక అందించాలని, రాత్రి సమయాల్లో హాస్టళ్లలో వార్డెన్ లు తప్పనిసరిగా ఉండాల్సిందేనని, విద్యార్థులను సొంత బిడ్డల్లా చూసుకోవాలని బీసీ సంక్షేమ శాఖాధి కారులకు స్పష్టం చేశారు. హాస్టళ్లను డీబీసీడబ్ల్యూవో, ఏబీసీడబ్ల్యూవోలు రాత్రి సమయాల్లో కూడా తనిఖీ చేయాల్సిందేనన్నారు. జరుగుమల్లి బీసీ హాస్టల్ వంటి ఘటనలు పునరావృతమైతే క్షమించే లేదని హెచ్చరించారు. విద్యార్థినులను వేధించినా, లైగింక దాడులు చేసినా నిందితులకు అదే ఆఖరి రోజు అని మంత్రి సవిత హెచ్చరించారు.

# స్వచ్ఛతా హి సేవలో పారిశుధ్య కార్మికులకు చేయూత

- పారిశుధ్య కార్మికులకు హెల్త్ చెకప్‌తో పాటు దుస్తులు, సబ్బులు, గ్లౌజుల పంపిణీ



**ఆగిరిపల్లి,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** ఆగిరిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులకు హెల్త్ చెకప్ నిర్వహించి, దుస్తులు, కొబ్బరినూనె, సబ్బులు, గ్లౌజులు తదితర సామగ్రిని పంపిణీ చేశారు. ఎంపీడీవో అబ్దుల్ సలాం పర్యవేక్షణలో మానేపల్లి జగదీశ్వర్ రావు, మదుపల్లి గోపాల్, యండూరు ప్రణీత్‌ల ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో అబ్దుల్ సలాం, ఈఓఆర్డీ దుర్గారావు, వై. చంద్రశేఖరరావు, మానేపల్లి సాయి కృష్ణ ప్రసాద్, సత్తు కోటేశ్వరరావు, గ్రామపంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో సత్సంగం, భజన కార్యక్రమం



**మచిలీపట్నం,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** నగరం లోని సర్కిల్ పేటలోని శ్రీ సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా వారి సహకారంతో బుధవారం సత్సంగం, భజన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 29 మంది మహిళలు పాల్గొని భజనలు సామూహిక ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష యుగళ గీత పారాయణం పుస్తకాలను మహిళలకు పంపిణీ చేశారు. భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యం భక్తిభావాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి సమర్పించిన నూతన వస్త్రాలను డాక్టర్ బూరగడ్డ శ్రీనాథ్ అందజేశారు. అనంతరం లక్కీ డిప్ ద్వారా ఎంపికైన లక్ష్మి అనే మహిళకు ఆ నూతన వస్త్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం కూనపురెడ్డి శ్రీనివాసరావు వై.ఆర్. పాండురంగారావు ఆలయ పూజారి శేషు తదితరులు పాల్గొన్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో కార్యక్రమంలో పాల్గొని సత్సంగం భజనలను విజయవంతం చేశారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి, తీవ్ర గాయాలతో మరొకరు...



**చల్లపల్లి/అవనిగడ్డ,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** చల్లపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో రామానగరంవద్ద జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తి తీవ్ర గాయాలతో విజయవాడలోని ఓ వైద్య శాలలో చికిత్స పొందుతున్నాడు.ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న మోపిదేవి లంక గ్రామానికి చెందిన దేవనబోయిన సాంబశివరావు (65) మృతి చెందగా నాగాయతిప్పకు చెందిన అవనిగడ్డ బాల శ్రీనివాసరావు తీవ్ర గాయాలతో విజయవాడలోని ఓ వైద్య శాలలో చికిత్స పొందుతున్నాడు.వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఎపి 39 ఆర్ బి 3030 నెంబర్ గల కారు వేగంగా ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిందని తెలుస్తోంది.సమాచారం అందుకున్న చల్లపల్లి ఎస్ ఐ డి.దుర్గాంజనేయులు సిబ్బంది తో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# "రావణబ్రహ్మ " వేష ధారణలో కానిస్టేబుల్ జొన్నలగడ్డ గోపాల్



**పెనుగంచిప్రోలు,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** వినాయకపండుగ సందర్భంగా గణేష్ మండపం నందు రావణబ్రహ్మ వేషధారణలో ప్రజలను మైమరపించి ఆనందింపచేసిన విజిలెన్స్ లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ జొన్నలగడ్డ గోపాల్ గత సంవత్సరం కూడా గణేష్ మండపం నందు దానవీర శూర కర్ణ వేషధారణ ధరించి ప్రజలను సంతోషింప చేస్తూ, తన అభిరుచిని చాటుకున్నారు. స్థానికులు గ్రామస్తులు గోపాల్ నటన తీరును అభినందిస్తూ ప్రశంసిస్తున్నారు...

# నూతన పంచాయతీ కార్యదర్శికి జనసేన నాయకుల అభినందనలు..



**విజయవాడ రూరల్,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు గ్రామ నూతన పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన అధికారికి జనసేన పార్టీ నాయకులు, స్థానిక ప్రముఖులు ఘనంగా అభినందనలు తెలిపారు. ఈరోజు రామవరప్పాడు పంచాయతీ కార్యాలయంలో నూతన కార్యదర్శి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మచిలీపట్నం పార్లమెంటు, గన్నవరం నియోజకవర్గ స్థానిక సంస్థల ఎలక్షన్ కోఆర్డినేటర్, జనసేన పార్టీ సీనియర్ నాయకులు రత్నం నాగేశ్వరరావు, విజయవాడ రూరల్ మండల జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి, రామవరప్పాడు సమగ్ర అభివృద్ధికి అధికార యంత్రాంగం నిరంతరం కృషి చేయాలని, అందుకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామవరప్పాడు శ్రీ వెంకమ్మ తల్లి దేవస్థానం డైరెక్టర్ పోతన దుర్గారావు, ప్రముఖ నాయకులు కాట్రగడ్డ రాంబాబు, కొండూరు శ్రీహరి, అంగజాల బాబి, లాయర్ కిరణ్, నీలం సాయి రంగారావు, చిలుకూరు ఆంజనేయులు, బాబురావు, గంటా సాంబశివరావులతో పాటు పలువురు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కార్యదర్శికి శుభాభినందనలు తెలిపారు.

# కొండపల్లిలో 142 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు




**ఇబ్రహీంపట్నం,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** పేదల కుటుంబాలకు భరోసా ఇచ్చే విధంగా ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలకు పట్టాభిషేకం పేరుతో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి లబ్ధిదారులు బస్సులో తరలి వెళ్లారు. బస్సును కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, టిడిపి నేతలు జెండా ఊపి ప్రారంభించారు. కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో 142 కుటుంబాలకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరింది. దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న నిరీక్షణ నెరవేరడంతో లబ్ధిదారుల హర్ష వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చిట్టిబాబు కూటమి ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భరోసా ఇస్తున్నట్టు తెలిపారు. అందులో భాగంగా ఎప్పటినుండో ఎదురుచూస్తున్న ఇళ్ల పట్టాలను పేదలకు పట్టాభిషేకం పేరుతో ఇళ్ల పట్టాలు అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్, టిడిపి పట్టణ అధ్యక్షులు కరిమికొండ బాలాజీ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బసవ ఉమామహేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ బి శ్రీనివాస్, స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# అనిగండ్లపాడు గ్రామంలో పోషకాహార మాస ఉత్సవాలు..



**పెనుగంచిప్రోలు,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** ఐసిడిఎస్ చిల్లకల్లు ప్రాజెక్ట్ పరిధిలోని సిడిపిఓ సత్యవతి ఆదేశాల మేరకు సూపర్వైజర్ రజిని జ్వల మేడం ఆధ్వర్యంలో అనిగండ్లపాడు గ్రామంలో బుధవారం పోషణ ఉత్సవం సేవా సంకల్పం పోషకాహారమాస ఉత్సవాలు అంగన్వాడి కేంద్రం 1,5 నందు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీ బాలింతలకు తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి వివరించి అలానే అంగన్వాడీ కేంద్రంలో ఇచ్చే పౌష్టికాహారం తో పాటు మరియు ఆకుకూరలు చిరుధాన్యాలు వాటికి ఉన్న పోషక విలువల గురించి వివరించడం జరిగింది, అలానే ప్రీస్కూల్ పిల్లలకు కూడా స్కూల్లో పెట్టే పౌష్టికాహారంతో పాటు వాళ్ళకి ప్రీస్కూల్ విద్యను అందించడం దాని గురించి తల్లులకుక అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలు,బాలింతలు,పిల్లలు, తల్లులు,అంగన్వాడి కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొనడం జరిగింది.

# స్కోచ్ అవార్డుతో అమలాపురం పురపాలక సంఘానికి గుర్తింపు

కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్‌కు అధికారుల అభినందనలు



**అమలాపురం,సెప్టెంబర్ 30 (వార్తాప్రభ) :** అమలాపురం పురపాలక సంఘానికి ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు లభించడం పట్ల కోనసీమ జిల్లా కలెక్టర్, అమలాపురం మున్సిపల్ ప్రత్యేక అధికారి ఆర్. మహేష్ కుమార్‌ను బుధవారం స్థానిక అధికారులు, ఉద్యోగులు అభినందించారు. పురపాలక సంఘం పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి, పరిపాలనా కార్యక్రమాలకు గుర్తింపుగా స్కోచ్ అవార్డు రావడం అమలాపురానికి గర్వకారణమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్, అమలాపురం తహసీల్దార్ వి.ఎస్. దివాకర్, ఉప్పలగుప్తం తహసీల్దార్ అశోక్ ప్రసాద్, పంచాయతీరాజ్ డీఈ రాంబాబు, సీనియర్ పాత్రికేయులు బోళ్ల సతీష్ బాబు, మున్సిపల్ ఉద్యోగులు తదితరులు పాల్గొని కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు. స్కోచ్ అవార్డు సాధించడం ద్వారా అమలాపురం పురపాలక సంఘం పనితీరుకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని వారు అభిప్రాయపడ్డారు. ఈ గుర్తింపు పురపాలక సిబ్బందికి మరింత ఉత్సాహాన్ని అందిస్తుందని పేర్కొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188